గురువులు

వేమన యోగి



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org

సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని స్క్రిబ్డ్ వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. దీనిద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) స్క్రిబ్డ్ వారి వెబ్ సైట్: https://www.scribd.com
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో స్క్రిబ్డ్ వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline: 9042020123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

స్క్రైబ్డ్ వారి వెబ్ సైట్:

http://www.scribd.com



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

వేమనయోగి

Dr Dayananda Swamy ebooks

స్వామి సుందర చైతన్యానంద

Dr Dayananda Swamy ebooks

వేడుకోలు

వేమన.... వేదనయే వేమన. సాహిత్యకాంతారమున విహరించు వేదండమే వేమన. వేమనది ఒక ప్రత్యేక వేదిక. వేమన వేలుపుకాదు; అతనిది వేదమూ కాదు. అతని వేడుకోలుకు వేతనము ఎంత? వెలనెవరు నిర్ణయిస్తారు? ఎవరు నిర్ణయించారు? వేమన విజ్ఞానవేత్త ఘాతమునకు కలతచెంది వీడికోలు చెప్పినవారేగాని వేడుకోలు విన్నవారెవరున్నారు?

Dr Dayananda Swamy ebooks

వేమన కాలములో వాణీ వైశ్వర్యము మలుపు తిరిగింది. వైషమ్యములను గాంచి వేమన విచలిత మనస్కుడయ్యాడు. దురాచారములను, దురవగాహనలను దర్శించి, దూరదర్శియై దుర్నీతిపై వేమన కాలు దువ్వాడు. కవితామ తల్లికి నూతన సొగసులిచ్చాడు. భావములో గడుసుతనము కనుబరచినాడు. భాషలో దుడుకుతనము చూపించినాడు. తీవ్రనిందకు వెనుకాడలేదు. తీక్ష్ణ పదజాలమునకు స్వస్తి చెప్పలేదు. వ్యాఘ్రధ్రుతితో విజృంభించాడు. వివాద గ్రస్తుడై మిగిలాడు. వైలక్షణ్యమును ప్రదర్శించి వైరమును తెచ్చుకొనినాడు. వైశద్యము లేనివారు వేమనను వైరిగా భావించారేగాని, వైశారద్యము గలవారు పచ్చని పైరులాగ చూసారు. స్వైరియైన వేమన వైరులను అంగీకరించడు. స్వచ్ఛతను కలిగిన వేమన పలుకులలో స్వాదిష్టమున్నది. స్పష్టతను కలిగిన వేమన బోధలో స్వారస్యమున్నది. వేమన కవియా; లేక వేదాంతియా? సంస్కర్తయా; లేక విజ్ఞాన విహర్తయా? వినీతుడా; లేక విప్లవవీరుడా? ఈ ప్రశ్నలన్నింటికీ ఒక్కటే సమాధానం. ఈ గ్రంథాన్ని అవలోకించండి.

ధవళేశ్వరం, విబుధజన సేవలో
31-1-89 వినీతుడు,
స్వామి సుందర చైతన్యానంద

Dr Dayananda Swamy ebooks

ఓం

వేమనయోగి

ఉపోద్ఘాతము

అమలమైన పలుకు లభిషేక వారిధి
తనువు దేవళంబు తాల్మి నొంది
యాత్మ శివునిఁ జేర్చు నాతఁడే శివయోగి
విశ్వదాభిరామ వినురవేమ !

పవిత్రపలుకులు పలుకుటకు నోచుకొనిన పుణ్యాత్ములు తీర్థయాత్రలకై తిరుగ నవసరము లేదనియు, అభిషేకములకు సాగర జలమును తీసుక రానవసరము లేదనియు. ఆలయములు నిర్మించి దేముని ప్రతిష్ఠ చేయ నవసరములేదనియు, అట్టి పుణ్యచరితుల పవిత్ర మేనులే పరమాత్మకు ఆలయములు కాగా, శివుని దర్శించువారి ఏకాగ్రదృష్టియే యోగమనియు, వారే శివయోగులనియు వేమనయోగి అభిప్రాయ పడినాడు.

వేమనయోగి ఒక విచిత్రమైన వ్యక్తి. అతడు వ్యక్తికాదు. వ్యవస్థ. అంటే సుస్థిరమైన ఒక వ్యవస్థయా? కాదు. వ్యవస్థనే నిలదీసి, నిగ్గు దీర్చే ఒక సుడుకు వ్యవస్థ. సుడులు తిరిగే దుర్వ్యవస్థలను తట్టి ఆపే సద్విమర్శనాత్మక వ్యవస్థ విమర్శలలో రమిస్తూ విమర్శలకు దక్కని, పరామర్శలకు చిక్కని ఒక అపూర్వ వ్యవస్థ. అది సంస్థాపరమైన వ్యవస్థకాదు వ్యవస్థాపరమైన సంస్థ. గోడలు లేని సంస్థ. మేడలు తెలియని సంస్థ. సమస్యలకు నిలయమైన సంస్థ. సమస్యలను పరిష్కరించే సంస్థ. పారద్రోలే సంస్థ.

Dr Dayananda Swamy ebooks

మరి వేమన కవిత్వమునందు ప్రామాణ్య మేపాటిది? అని కొందరు చర్చించు చుందురు? ఏ ప్రమాణము నంగీకరించని వాని కవితకు ప్రమాణ మేమిటి? ప్రేమ నిండిన హృదిలో, భ్రమచెదిరిన మదిలో నిక్షిప్తమైన ప్రమాణము అనుమాన వైఖరిద్వారా ఎలా గ్రహించవలెనో ప్రమాతలు ఆలోచించాలి.

వేమన సాహిత్యమంతయూ ప్రమాణమైనదియే నని నేను అంగీకరించలేను. కానీ వసంత ఋతువువలె లోకహిత మొనర్చుచు చరించే సంత్ పురుషులు యత్నించి పొందదగిన ఎన్నియో జ్ఞానరత్నములు వేమన కవిత యందు ఉన్నవని నేను చెప్పగలను.

వేమన కవిత్వమునందు ప్రక్షిప్తములున్నవా? కోకొల్లలుగా యున్నవని నా అభిప్రాయము. సామాన్యభాషలో ఉండుటచేత తమ స్వలాభానికి వేమనను ఉపయోగించు కొనుట దుర్మతులగు వారికి దుర్భేద్యమేమీకాదు, కానీ ప్రామాణ్యము లోపించిన కారణముగా వేమన సాహిత్యమునందు ప్రక్షేపములను చేర్చువారు పెక్కుమంది ఉండరు అని తన దృక్కోణమునుండి దర్శించి నిర్ణయము చేసిన రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారి అభిప్రాయముతో నేను ఏకీభవించలేను. ప్రక్షేపములు జరుగుట ప్రామాణ్యమును దృష్టి యందిడుకొని కాదు, ప్రజాదరణను మదిలో దర్శించుకొనియే.

" వేదసారమెల్ల వేమనయె యెఱుఁగు "

నను మాటను జూడగా బడాయిమాట తప్ప వేఱుగాదు అని రాళ్ళపల్లి అభిప్రాయపడెను. వేమన నుడివినది వేదసారమేగాని వేదముకాదు. వేమన వాక్కునుండి వేదమంత్రములను విని కుతూహల పడువారికి రాళ్ళపల్లివారి విమర్శ రమణీయముగా నుండునేమోగాని, వేదసారమైన ఆత్మవాణిని ఆలకించ గోరువారికి శర్మగారి విమర్శ చర్మమును వేడెక్కించును.

Dr Dayananda Swamy ebooks

విమర్శలనే పరామర్శించు వేమనను విమర్శించకుండా ఉండుట కూడా కష్టతరమే. ముందు వెనుకలు చూడని విమర్శను సాహితీ సింహాసనమున కూర్చుండబెట్టి పట్టాభిషేక మొనరించిన ప్రథమఘనత వేమనకే దక్కినదనుటలో అతిశయోక్తిలేదు. తనపై ఇతరులువేయు విమర్శను అతడు లక్ష్యపెట్టడు. దోషములను చూపిన చెదిరిపోడు.

" తప్పులెన్నువారు తండోప తండంబు "

లని సరిపెట్టుకొనును. సరిపడి నిలుచును

" వేమ డిట్లు చెప్పు వేయి పద్యంబులు
తప్పులెన్నియున్న నొప్పియుండు "

నని తానే చెప్పుకొనియెను.

జిజ్ఞాసువులారా! వివాదగ్రస్థమైన ఇలాంటి విషయాలు వేమన విషయములో కోకొల్లలుగా యున్నను విచారయుక్తమైన అణిముత్యాలను మీ అభిలాష మేరకు అందించాలని అభిప్రాయపడి వేమనార్యునిపై కలాన్ని కదిలించుచున్నాను.

వేమన అద్వైతి యని నిస్సందేహముగా నమ్మవచ్చును. ఆతని యోగమెచ్చట ఆగినదో, జ్ఞానమెచ్చట ప్రారంభమైనదో నాకు తెలియుటలేదు, కానీ అతడు అద్వైత జ్ఞానమును పుణికి పుచ్చుకొన్న తాత్త్వికుడనుటలో అతిశయోక్తిలేదు.

Dr Dayananda Swamy ebooks

ఆత్మ విచారము

ఈ సృష్టికి పరమాత్మ అధిష్ఠానమై ఉన్నాడని వేమన పూర్ణంగా విశ్వసించును. పరమాత్మ ఆజ్ఞలేనిదే గడ్డిపరక కూడా కదలదని అతని అభిప్రాయము. ఈ తత్త్వమును గ్రహించి పూర్ణానందము ననుభవించుచూ, నిత్య తృప్తులై, నిరాశ్రయులై ఉండుటయే సముచిత తత్త్వ మార్గమని వేమన బోధిస్తాడు.

నీవాడిన నేనాడుదు
నీ వుండిన నేను నుందు నిర్విణ్ణుండనై
నీవు దలంచినఁ దలఁపుదు
నీవు నగిన నేను నగుదు నిజముగ వేమా !

అని తనద్వారా నడిచే, నడిపే పరమాత్మ లీలను సుస్పష్టముగా దర్శించు మహాత్ముడే వేమనార్యుడు.

తన పలుకు లన్నియు భగవదాజ్ఞగానే కదిలినవని స్థిరముగా వేమన నమ్మినాడు. భగవత్ప్రేరణతోనే తాను పలుకు తున్నట్లు తెలియ జేసినాడు.

అల్పుడైన నేమి అధికుడైన నేమి
చెప్పవలయు రీతి చెప్పినాడ
హరుని ఎరుకలేక యాకు అల్లాడునా
విశ్వదాభిరామ వినుర వేమ !

Dr Dayananda Swamy ebooks

అని పరమాత్మ చట్టాలపై తనకున్న పూర్ణ విశ్వాసమును వేమన వ్యక్త మొనరించినాడు. సత్యద్రష్ట లందరూ అలాగే అభిప్రాయ పడుతారు. అహంకారము నశించిన వాడు, పరమాత్మకై పరితపిస్తూ పరవశించు వాడు తనకు ఏమీ తెలియదనియు, తానేమీ కాడనియు, సమస్తమూ పరమాత్మ కరుణపై ఆధారపడి యున్నదని సదా భావించును. నిరంతరము పసిబిడ్డవలె జీవించును. పరమాత్మకొరకై పసిబిడ్డవలె రోదించును. టెన్నిసన్ కూడా ఈ అభిప్రాయమునే తెలియజేస్తాడు.

....but what am I ?
An infant crying in the night;
An infant crying for the light;
And with no language but a cry...

" నే నేపాటి వాడను ?
రాత్రివేళ రోదించెడి బాలకుండ;
జ్యోతికై తపించెడి అర్భకుండ
భాషలేని రేక లిడెడి వాడ;

నని మహాకవి టెన్నిసన్ అభిప్రాయ పడినాడు.

కార్యరూపమైన జగత్తునందు గోచరించు భిన్నవస్తువులన్నియు కారణస్వరూపమైన బ్రహ్మముకన్నా అన్యముగాక, బ్రహ్మమునందు అభిన్నమై, ఏకమై అలరారు చున్నవని వేమన తెలియజేయును.

పని తొడవులు వేఱు బంగార మొక్కటి
పలు ఘటములు వేఱు ప్రాణ మొక్కటి
యరయుఁ దిండ్లు వేఱు టాఁకలి యొక్కటి
విశ్వదాభిరామ వినుర వేమ

Dr Dayananda Swamy ebooks

ఆభరణములు వేరైనను అందులోని బంగారము ఒక్కటియే. దేహ ములు భిన్నమైనను ప్రాణమొక్కటియే. ఆహారపదార్థములు వేరైనను ఆకలి ఒక్కటియే. వివిధ రూపములు తెలియుచున్నను అట్టి రూపము లుగ అగుపించు పరమాత్మ ఒక్కడే.

కనుక బ్రహ్మము ఉన్నదియే, మనముందున్నదియే. తెలియని వానికి బ్రహ్మము సుదూరము, తెలిసినవానికి ముంజేతి కంకణము. అందుచేతనే "తద్దూరే తద్వంతికే" అది చాలాదూరము, చాలా సమీ పమును అని ఈశావాస్యోపనిషత్తు ప్రవచించినది. ఈ విషయమును వేమనార్యుడు చక్కగా బోధించును.

బ్రహ్మవాదులెల్ల బ్రహ్మం బనంగను
వలసి తెలిసి చూడ వద్దనుండు
ముందునున్న యట్టి ముద్రికఁ గానరు
విశ్వదాభిరామ వినుర వేమ !

బ్రహ్మవాదులు తెలిపెడి బ్రహ్మపదార్థము ఎక్కడోగాదు. పరికించి చూచినచో మనముందే యున్నది. మనముందే నిలిచియున్న బ్రహ్మ మును మోహముచే లోకులు గానలేకున్నారు అని వేమన ప్రబోధించును.

అంతటా వెలుగుచున్న బ్రహ్మమును దర్శించవలెనన్నచో మొదట ఆంతర్యములో ఆత్మాను సంధానము కలగాలి. ఆంతర్యములో అనుభూతి నొందిన వానికే బ్రహ్మము అంతటా గోచరించును. ఆంత ర్యములో ఆత్మను దర్శించుటకు సహకరించు సాధన ప్రక్రియయే ధ్యానము. 'ధ్యానం నిర్విషయంమనః' విషయవృత్తులు అణగుటయే ధ్యానము. రెండు సంకల్పాల మధ్యనున్న సాక్షీ చైతన్యముతో తాదా త్మ్యము చెందుటయే ధ్యానము. ఇరువురి గోపభామలమధ్య గోపా

Dr Dayananda Swamy ebooks

లుడు. రెండు సంకల్పాలమధ్య పరమాత్మ స్వరూపం. అట్టి నిశ్శబ్ద నిరావరణ సమాధియే వాంఛించదగినది అని వేమనార్యుడు తెలుపుతాడు.

ఆకసంబు శూన్యమందు శబ్దము పుట్టె
శబ్ది మధ్యమునను సరగఁ జూడ
శబ్దరహితమగుచు వెలఁగును బ్రహ్మంబు
విశ్వదాభిరామ వినురవేమ !

ఆకాశము శూన్యము, సూక్ష్మముకూడా. శూన్యాకాశమునుండి శబ్దము ఆవిర్భవించెను ఈ శబ్దము మధ్యనే శబ్దరహితముగా శాంతబ్రహ్మము వెలుగుచుండుననియు, దాని ననుభవించుటయే ధ్యానమనియు వేమన అభిభాషించెను

అలలు లేని జలధివలె నుండి మదిలోన
వెలివి గూడి తన్ను వెలియు నతడె
తలప, సజ్జనుడని ధర చెప్పబడునయా
విశ్వదాభిరామ వినురవేమ !

నిస్తరంగ జలధివలె ఆంతర్యము నిస్సంకల్ప స్థితిలో అమనస్కమై నిర్మలమైనపుడు ఇంతవరకు బాహ్య విషయములను గ్రహించు తెలివి ఆత్మలో లయించి తనను తాను గాంచనగును. ఇదియే సత్యదర్శనము. ఇట్టి దర్శనమును చేయువాడే సజ్జనుడు అని వేమన పలికెను. ఇట్టి నిర్విషయ ప్రాప్తికే ధ్యానము సాధనమని చెప్పబడినది.

ఇట్టి ధ్యానతత్పరత కలుగవలెనన్నచో అనన్యభక్తితో ఆత్మధ్యానమును సాగించవలెనని వేమన బోధచేయును. "అన్యాశ్రయాణాం

Dr Dayananda Swamy ebooks

త్యాగః అనన్యాతా" ఇతర ఆశ్రయము లన్నింటిని త్యాగమొనర్చుటయే అనన్యత అనిపించుకొంటుందని నారద మహర్షి భక్తిసూత్రములలో తెలియజేయగా ఈ విషయమునే వేమన చక్కగా తెలియ పరచును.

ఇతర చింతలన్ని వెతలని మదినెంచి
జతుక మంటు రీతి జగము మఱచి
సతత మాత్మయందె సయ్యాటలాడరా
విశ్వదాభిరామ వినుర వేమ !

అన్యచింతలన్నియు ఆవేదనలనే అందించును. కనుక వాటిని వీడి సత్యచింతన మొక్కటియే సాగించి తరించుము. ప్రపంచమునకు అంటీ అంటక ఉండునట్లు లక్కవలె జీవింపుము అని వేమన ఉద్బోధించును. మాయనుండి విడిపడి తరింపుమని ప్రబోధించును. "మమ మాయా దురత్యయా" నా మాయను దాటుట దుర్లభము అని శ్రీకృష్ణుడు గీతలో తెలుపును. గురుబోధయే మనలను మాయాబాధనుండి విడిపించును. ఈ గురు ఆవశ్యకత ఎంతైనా కలదనియు, ఆధ్యాత్మిక మార్గమున గురువులేనిదే గుర్తుతెలియుట కష్టమనియు వేమనకూడా అభిప్రాయ పడతాడు.

కప్పయు బామును బోరం
గప్పను సర్పంబు మ్రింగు కైవడి మెఱయం
గప్పను వెతలం ద్రోసెడి
యొప్పున నా చొప్పు దెలిసి యుండర వేమా !

సర్పమండూకములు పరస్పరము పోరు సల్పునపుడు సర్పము కప్పను మ్రింగివేయును. అదే సమయానికి ధీరుడగు పురుషుడున్నచో పామును

Dr Dayananda Swamy ebooks

చంపి కప్పను విడిపించును. మాయ యనెడి సర్పము జీవుడైన కప్పను మ్రింగివేయును. సద్గురువు కృప లభ్యమైనచో కప్ప సర్పమునుండి విడిపడునట్లు జీవుడు మాయను వీడి మోక్షము నొందును అని వేమన కవి బోధించును.

మోక్షప్రాప్తి నొందగోరు ముముక్షువు దేహాభిమానమును వదిలి జీవించాలి. " అవ్యక్తాహి గతిర్దుఖం దేహవద్భిరవాప్యతే" దేహాభిమానము గలవారికి ఆత్మధ్యానము పొసగదు అని గీతలోని భక్తియోగము తెలుపుతుంది. వేమన ఈ విషయమును ప్రస్తావించును

నిన్నుఁ జూచుచుండ నిండును దత్త్వంబు
తన్నుఁ జూచుచుండఁ దగులు మాయ
నిన్ను నెఱిఁగి నపుడె తన్నుఁదా నెఱుఁగును
విశ్వదాభిరామ వినురవేమ !

నిన్ను అనగా నీ స్వరూపమైన ఆత్మను దర్శించినచో తత్త్వము అనుభవమునకు అందును. తనను అనగా నీ దేహమును నీవుగా జూచుకొన్నచో మాయ నిన్ను మ్రింగును. ఆత్మనెరిగిన నీకు బ్రహ్మము నీవుగానే తెలియును అని వేమనార్యుడు ఆత్మజ్ఞానమును సులభరీతిన అందించును.

బ్రహ్మమును తెలియుట అనగా బ్రహ్మము నీవే అయి ఉండుట అని భావము. నది సాగరములో ప్రవేశించి నామ రూపములను గోల్పోయి సాగర రూపమును దాల్చునట్లు, బ్రహ్మవిదుడు బ్రహ్మమై భాసించును. ఇదియే పరంధామము. ఈ స్థితిని చేరిన పిమ్మట తిరిగి రావడమంటూ ఉండదు. రాక పోకలు తెలియని రమణీయ సదనమదియే.

Dr Dayananda Swamy ebooks

"యద్గత్వా న నివర్తన్తే తద్ధామ పరమం మమ"

'దేనిని పొందినచో మరల తిరిగిరారో అదియే నా పరమ ధామమై ఉన్నది" అని శ్రీ కృష్ణపరమాత్మ భగవద్గీత— పురుషోత్తమ ప్రాప్తి యోగమునందు తెలిపియున్నాడు. ఈ విషయమునే వేమనార్యుడు కూడా బహుచక్కగా తెలిపి యున్నాడు.

బ్రహ్మభావ మెఱిగి చెడిపోని వారలు
బ్రహ్మభావ మెఱిగి పరగు చుంద్రు
నీరు ముత్యమైన నీరుగా మారునా
విశ్వదాభిరామ వినురవేమ !

స్వాతిచినుకు ముత్తెపు చిప్పలో బడి ముత్యముగా మారుతుంది. ముత్యముగా మారిన జల బిందువు తిరిగి జల రూపమును బొందలేదు. అలాగే బ్రహ్మముగా మారిన జీవుడు తిరిగి జీవత్వమును పొందడు.

జీవత్వమనునది కల్పితమైనదియే గాని సత్యము కాదు. అఖండమైన బ్రహ్మము నందు జీవభ్రాంతి ఆరోపితము మాత్రమే. పరిమితమైన జీవభావననుండి విడిపడినపుడు తానే బ్రహ్మమనెడి అనుభూతి సాధకునకు గలుగును. గమ్యము బ్రహ్మమైనపుడు మార్గముకూడా బ్రహ్మచింతనయే అయి ఉండాలి. బ్రహ్మ చింతన మనగా బ్రహ్మము తనకన్నా అన్యమని భావించుటగాక, తానే బ్రహ్మమనెడి స్వరూపాను సంధానమే ఉత్తమోత్తమమైన మార్గమనియు, తత్త్వయోగి అట్టి స్వరూప స్థితిలో ఉండేందుకే సదా ప్రయత్నించుచూ తరించుననియు వేమన అభిప్రాయపడుతాడు.

Dr Dayananda Swamy ebooks

తన్నుఁ దాఁ దెలిసిన దైవంబు మఱిలేదు
తానె దైవమంచుఁ దత్త్వయోగి
తలఁచుచుండ నెపుడు ధరలోన నర్రయుము
విశ్వదాభిరామ వినురవేమ !

తన స్వరూపమే దైవమని భావించువానికి వేఱుదైవముతో పని ఏమున్నది ?

జ్ఞాన నైశిత్యముతో సాధకుడు చరించినపుడే అతడు ముక్తి ధామ మలంకరించును. అంతేగాని మూఢ విశ్వాసాలతో, మౌఢ్య ఆచారాలతో అవగాహన లేకుండా ఆచరించెడి కర్మలవలన ప్రయోజనమేమి? గుణాతీతుడే జీవన్ముక్తుడు. గుణాతీతుడు కావలెనన్నచో గుణ వికారములనుండి విడిపడాలి. అంతర్యంలో ఆత్మాను సంధానము చేయాలి. అంతేగాని కేవలము తీర్థయాత్రా సేవనమును అర్థరహితంగా ఆచరించినంత మాత్రమున వ్యక్తి తరించునా? ఈ విషయమును వేమన ప్రస్ఫుటముగా తెలియజేస్తాడు.

కాశియాత్రఁ జేసి గాసి నొందఁగ నేల
రోయు గుణ వికార రూపమడఁచు
మోసపోక యెఱుక మూలంబు గనుచుండు
విశ్వదాభిరామ వినురవేమ !

కాశీ రామేశ్వరాది పుణ్యక్షేత్రములను దర్శించుటకు మానవుడు పడరాని శ్రమలు పడుచుండును. యాత్రలు చేయునేగాని గుణముల నతిక్రమించలేడు. త్రిగుణముల నతిక్రమించి, సంకల్పము ఎచ్చటనుండి

Dr Dayananda Swamy ebooks

కదులుచున్నదో (యెఱుక మూలంబు) గాంచ గలిగిన వానికి త్రివేణి సంగమము తన భ్రుకుటిలోనే లభ్యమగును అంటున్నాడు వేమనయోగి.

తన్ను తానెఱుగని వానికి జన్మలో తన్నులు తప్పవు. తన్ను తానెఱిగిన వానికి తత్త్వము తనకన్నా భిన్నము కాదని తెలిసినందున తనను తాను తనలో తానుగ గాంచుటయే నిజమైన తత్త్వజ్ఞానము. తన్ను తానై తెలుసుకొనుటయే తందనాన....తందాన....తందాన.... తానె తందనాన....ఇది బుఱ్ఱకథ కాదు....బుఱ్ఱలో వెదకితే దొరికిన నిజకథ....నీ కథ....

తన్నెఱుంగువాఁడు తాను తానై యుండు
తన్నెఱుఁగనివాడు తాను తానె
తనదులోనివాఁడు తానె తానవునయా
విశ్వదాభిరామ వినురవేమ !

తనను తెలియని తాను అజ్ఞాని. తనను తెలిసిన తాను జ్ఞాని. తనలోని తాను జ్ఞానరూపమై ఉన్నది. తనను తాను తెలియనినాడు తనకు వేఱుగా తెలియున వన్నియు తెలియదగినవి కావని వేమన అభిప్రాయ పడుతాడు.

ఒకనాడు రమణ మహర్షిని దర్శించేందుకు కొందరు భక్తులు వచ్చారు. వారిలో చిన్న బిడ్డను తెచ్చిన తల్లి కూడా ఉన్నది.మహర్షిని చూడగానే ఆ బిడ్డ "తాతా" అనడము జరిగింది. వెంటనే ఆబిడ్డ తల్లి నోరు మూయుచూ, "తప్పు-తప్పు....భగవాన్‌ని తాత అనవచ్చునా ?" అన్నది వెంటనే భగవాన్ చిరునవ్వును చిందిస్తూ, "ఎందుకమ్మా ! ఆ బిడ్డకు తెలియని తప్పును తెలుపుతావు ? ఆ బిడ్డ చెప్పినదానిలో తప్పేమున్నది. 'తాత' అనడం తప్పా! తాత — అంటే ఏమిటి? తాను

Dr Dayananda Swamy ebooks

తానే అనునదియేకదా తాత అనుపదములోని అర్థము. నిన్ను నీవు తెలుసుకొనినపుడే నిర్వికల్పానందము కలుగునని ఆబిడ్డ చెబుతున్నది" అని రమణ మహర్షులవారు చమత్కరించారు.

తన్ను తానెఱుగుట యనునది అంత తేలికైన పనికాదు. బల కరమైన ఇంద్రియాలు మానవుని బలహీనునిగ మార్చి వేయుచుండును. మహాత్ముల యొక్క కృపలేనిదే నిగ్రహము కుదరదు. నిర్ణయము నిలువదు. అందుచేత జ్ఞానులగువారిని సేవించి తరించాలి. ఈ విషయము వేమన నొక్కి వక్కాణించును.

జ్ఞానియైన వాని మానక పూజించు
మనుజుఁడెప్డు పరమునను ముదంబు
సుఖము నందుచుండు సూరులు వర్ణింప
విశ్వదాభిరామ వినురవేమ !

తత్త్వము నెఱిగిన జ్ఞానిని ఎవడయితే పూజించునో అట్టివాడు కూడా పుణ్యాత్ముడగును. ఇహపర సుఖముల నన్నింటిని జ్ఞాని పాదాల చెంతనే పొందగలుగును అని వేమన అభిప్రాయపడినాడు.

జ్ఞానిని సేవించుట వలన అజ్ఞానము నశించును. జ్ఞానము కలుగును. జ్ఞానము కలుగగానే తానే మోక్షరూప మగును.

జీవముం దెలిసినఁ జెలఁగు మది చలించు
దైవ మగుపడినను దగులు బుద్ధి
దీప్తభానుని గని తిమిరంబు నిలుచునా ?
విశ్వదాభిరామ వినురవేమ !

Dr Dayananda Swamy ebooks

జీవుడన నేమిటో తెలియగానే మనస్సు చంచలత్వమును కోల్పోయి కుదుటపడును. కుదుట పడిన మనస్సులో మాధవుడు గోచరించును సూర్యుని ముందు అంధకారము నిలువలేనట్లు, జ్ఞానము కలుగగానే అజ్ఞానము అదృశ్యమగును. అజ్ఞానము అంతరించగానే అజ్ఞాన జనితములైన, అహంకార, మమకారాదులు కూడా అదృశ్యమగును. 'నేను' అనుట అహంకారము. 'నాది' అనుట మమకారము. ఈ రెండును జ్ఞానముదయించిన వానిలో గోచరించే అవకాశము లేదు. అహంకారమును చిందించే తనువు తనది కాదనియు, మమకారమును అందించే ధనము, బాంధవ్యములు తనకు లేవనియు చక్కగా తెలిసికొనును. తాను చక్కగా నెఱుంగుటయేగాక ఇతరులకు కూడా తెలియజెప్పును. అట్టివాడు పరమాత్మయే అయి ఉన్నాడని వేమన అభిప్రాయము.

ఆలుసుతులు మాయ యన్నదమ్ములు మాయ
తల్లి దండ్రి మాయ తాను మాయ
తెలియనీదు మాయ దీనిల్లు పాడాయె
విశ్వదాభిరామ వినురవేమ !

స్వప్నములో తలలేని మనిషి కాళ్ళులేని స్త్రీతో కలిసి నడిచి, భూమిలేని తోటలో ప్రవేశించి, రూపములేని చెట్టులో, స్పర్శకు అందని ఫలమును కోసి నాలుకలేని నోటితో భుజించినట్లు తెలిసినది. ఆ వ్యక్తి మేల్కొనుట జరిగినది. కళ్ళు తెరచి చూడగానే స్వప్నము అబద్ధము అనెడి నిజము తెలిసివచ్చినది. ఈ స్వప్నములో గోచరించిన తోట, స్త్రీ, చెట్టు, ఫలము అన్నియును స్వప్నగతమైనవియే గనుక అసత్యముగా తెలియుచున్నవి. స్వప్నములో గోచరించిన వస్తువులలో ఒకవస్తువు సత్యమై మరొక వస్తువు అసత్యమయ్యేందుకు వీలులేదు.

Dr Dayananda Swamy ebooks

అలాగే మనస్సునకు తెలియవచ్చేడి ఈ దృశ్యమాన జగత్తంతయూ మాయారూపమై తెలియుచున్నది. మాయారూపమైన జగత్తులోని సంబంధములన్నియూ మాయా స్వరూపములే అయి ఉన్నవి. వానిలో ఒకటి సత్యము గాను, మరొకటి అసత్యము గాను ఉండేందుకు వీలు లేదు. చలన చిత్రమును గాంచునపుడు అందులో ఒక పాత్ర సత్యము, మరియొక పాత్ర అసత్యము అని భావించుట వీలుపడునా? అలాగే మాయా ప్రపంచములో తెలియవచ్చు సంబంధ బాంధవ్యము లన్నియు మాయా స్వరూపములే అయి ఉన్నవి.

భార్యా పిల్లలు, అన్న దమ్ములు, తల్లి దండ్రులు సర్వమూ మాయారూపములే. కారణమేమి? వీరందరు ఎవరికి తెలియుచున్నారు? మనస్సునకు తెలియుచున్నారు. మనస్సు మాయాస్వరూపమని మనకు తెలుసు. మాయారూపమైన మనస్సుకు మాయకన్నా అన్యమైనది తెలిసే అవకాశము లేనందున సమస్తము మాయగానే తెలియుచున్నది. కనుక మాయా నిర్మితమైన మనస్సుతో తాదాత్మ్యం చెంది అలమటించు జీవుడు తాను పరిమితుడని భావించుట వలన తానూ మాయగానే మిగిలినాడు. కన్నుతో కన్నును చూడలేము. మాయతో మాయను చూడలేము. అందుచేత మాయ ఎవరికి తెలియబడదని వేమనార్యు డనుచున్నాడు.

ఎవరికి తెలియరాని మాయను వేమన తెలిసి నిర్వచించుచున్నాడా? లేక తెలియకనే పలుకుచున్నాడా? తెలిసియే పలుకుచున్నాడు. ఎలా? ఈ ప్రశ్నకు సమాధానంగా "మాయ ఇల్లు పాడైనది" అనితెలుపుచున్నాడు. మాయ ఇల్లు కూలినపుడే మాయ మనకు బోధపడును. అలాగే మనస్సునకు మాయ తెలియదు. మనస్సు కూలిన దశలో, కాలిన దశలో, అలా కూలినది అనెడి సత్యము ఎఱుకపడును.

Dr Dayananda Swamy ebooks

వైరాగ్యము

జీవుడు నిత్యముక్తుడే గనుక బంధము అనునది భ్రాంతియే అగును స్వకల్పిత అజ్ఞాన ముడులను ఛేదించుకొని ఆత్మ సామ్రాజ్యమును అధిష్ఠించవలెననిన ముడులు ఎలా ముడులు తిరిగి యున్నవో తెలిసి రావాలి. వ్యాధి ఏమిటో తెలిసి నపుడే ఔషధ సేవనము ద్వారా బాధను తొలగించుకొను అవకాశము కలుగును. మానవుడు తనకు తానుగా తయారు చేసుకొనిన మాయా ప్రపంచము గారడి అనియు, అశాశ్వత మనియు వేమన తెలుపుచున్నాడు.

తనువు నస్థిరమని ధనము నస్థిరమని
తెలుప నేర్చి తాను దెలియ నేర్చి
పాత్రుడైన యోగి పరమాత్ముడే సుమా
విశ్వదాభిరామ వినురవేమ !

ప్రాపంచిక బంధములన్నియు అజ్ఞానముడులే ననియు, జ్ఞాన ఖడ్గముచే వానిని ఛేదించ వలసిన అవసరము మానవునికి ఎంతైనా గలదనియు వేమన అభిప్రాయపడెను. మమకారము మానని గాయమువలె జీవిని పీడించును. మమకారానికి కారణము బాహ్యంలో లేదు. మమకారమును సృష్టించేది మనస్సే. మనస్సునకు అవగాహన కుదిరితే మమకారము నిర్వీర్య మవుతుంది. నీరసపడుతుంది. కాలములో నశించి పోతుంది. మన లౌకిక బాంధవ్యము లన్నియు క్షణభంగురములనియు, అశాశ్వతము లనియు గుర్తెఱుగవలెను. సదా మనస్సునకు ఈ విషయమును జ్ఞాపకము చేయుచుండవలెను.

Dr Dayananda Swamy ebooks

ఏమి గొంచువచ్చె ఏమి తాఁగొనిపోవు
పుట్టువేళ నరుడు గిట్టువేళ
ధనము లెచటి కేగు తానేగు నెచ్చటికి ?
విశ్వదాభిరామ వినురవేమ !

తల్లి గర్భము నుండి కదిలి వచ్చిన నాడు మానవుడు తెచ్చిందంటూ ఏమియును లేదు. తనదంటూ ప్రతికన్ని రోజులు ప్రోగుచేసుకొని నవి ఉన్నను, కాటిలో కాలిడునాడు కొనిపోయే దేమియును ఉండదు. జీవించు కాలములో ఆశకు లోనైన మానవుడు సంపదను కూడ గట్టుకొనుటలో సమయమునంతా పోగొట్టుకొనును. మరణ మాసన్న మైన సమయాన తాను పట్టుక పోయే దేముంది ? దేహము వల్లకాటికి పోగా, దాచిన ధనము పరుల చేతికి చేరును ఈ అప్రయోజకపు నడక సముచితమైనది కాదనియు, భగవంతుని పొందుటకు చేయు యత్నమే శ్రేయము నొనగూర్చు ననియు వేమన తెలుపుచున్నాడు

ఇల్ల సుమీ సంసారమె
యిల్ల సుమీ యాయుధంబు నిఁక చాలంగాఁ
దల్లి సుమీ పంచాక్షరి
కల్ల సుమీ సతుల వలపు గనుఁగొన వేమా

సంసారము నిస్సారము. బలము బుద్బుదము. పంచాక్షరియే శరణ్యము. యువతి ప్రేమ బూటకము. దీనిని కనిపెట్టి జీవించుము అని వేమన తెలుపుచున్నాడు.

సంసారము సారరూపమని భావించి బ్రతుకు సారహీనమగు నంతవరకు వ్యక్తి పరిశ్రమించును. ఇది మాయా సంసారమనియు,

Dr Dayananda Swamy ebooks

మరువ దగినదియే గాని మననము చేయ దగినది కాదని ఒకనాడు గ్రహించును. ఆ దశలో శరీర పటుత్వము తగ్గియుండును. అడుగడుగున సుడిగుండము లేర్పడే ప్రమాదము సంభవించును ఈలోగా నావ తీరమును చేరుట మంచిదని వేమన హితము చెప్పుచున్నాడు. కామమును ప్రేమయని తప్పుగా చదువుకొని బ్రతుకును వమ్ముచేసుకోవద్దని "ఓం నమ శ్శివాయ" అనెడి పంచాక్షరిని పట్టుకొని తరించమని తెలియజేయుచున్నాడు. ఇలలోని ఇల్లు, ఇల్లాలు సర్వమూ కలయేననియు, మననము చేయబడు మంత్రమే తల్లిలా కాపాడుతుందనియు వేమన తెలియజేయుచున్నాడు.

చాలు చాలు నిలను జనన మరణములు
మేలు గావు మాయ మెలకు వెఱఁగి
ప్రాలు మాల కిలను భక్తిచేఁ బూనుము
విశ్వదాభిరామ వినురవేమ !

చావు పుట్టుకలు యాతనా స్వరూపములు. దుఃఖయుతములు. మాయా జనితములు. ఆద్యంతములు తెలియని ఆవేదనా స్వరూపములు. ఇవి జీవునకు నిరంతర దుఃఖమును అందించుచుండును. దేహమున కంటిన బురదను జలముతో శుభ్రము చేసుకొను విధముగా జీవుని కంటినమాలిన్యమును భక్తి జలముచే శుభ్రమొనర్చు కొనవలెను. భక్తి గలవాడు మాయను అవలీలగ దాటును. మాయను దాటినవాడు మాధవుడగును.

తల్లి దండ్రి చావఁ దా నాలితో గూడి
యిల్లుఁ గట్టుకొన్న యింపులెల్లఁ
గొఱుతు మీరి దొంగ కూడడిగిన యట్లు
విశ్వదాభిరామ వినురవేమ !

Dr Dayananda Swamy ebooks

తనకు జన్మనిచ్చిన జననీ జనకులు వల్లకాటికి కదిలిపోయారు. ఇది కళ్ళారా చూసి కూడాను తానొక అందమైన మేడగట్టుకొని, అనువైన అర్ధాంగితో కూడి ఆనందయాత్రను సాగించాలని చరించు మానవుడు కాలము తనలో దిగియున్న క్షణాన కూడా సిగ్గువిడిచి అన్నపానాదుల నాశించు దొంగతో సమానమని వేమన గర్హించుచున్నాడు. తన తల్లిదండ్రులవలె తానూ ఒకనాడు శ్మశానానికి కదల వలసిన వాడేనని గ్రహించలేక అర్థకామాదు లనెడి రెండు పురుషార్థములకై సహజములతో సంచరించు పశువువలె బ్రతుకుచున్నాడు అని వేమన నిందించుచున్నాడు. దేహభ్రాంతి ముక్తికి అడ్డుగోడ యని తెలుపుచున్నాడు.

నీళ్ళమీద బుగ్గ నిలిచిన యప్పుడు
తళ్ళువేగ వచ్చి తాఁకు గాదె
విడెడు కుండ కింత విభ్రాంతి యేలరా
విశ్వదాభిరామ వినురవేమ !

జలముపై బుద్బుదము కదులు చుండును. గాలి సోకగానే కెరటము కదిలి, నీటి బుడగను చెదర గొట్టును. బుడగ బ్రతుకు బుగ్గిపాలగును. అలాగే మానవ జీవితము కూడా నీటిబుడగవలె యున్నది. ఎక్షణమైనను మృత్యుగాలి వీచి శరీరము పతనమగును. ఏనాటికైనా చిక్కులలో పడే దిక్కులేని మట్టికుండ యనెడి దేహముపై మోహమేల? అని వేమన సూటిగా ప్రశ్నించుచున్నాడు.

పుట్టు దుఃఖమునను బొరలు దుఃఖమునను
గిట్టు దుఃఖమునను గ్రిందుపడును
మనుజ దుఃఖమువలె మఱిలేదు దుఃఖము
విశ్వదాభిరామ వినురవేమ !

Dr Dayananda Swamy ebooks

మానవుడు పుట్టుకలో దుఃఖము ననుభవించును. జన్మ దుఃఖరూపము గనుకనే బిడ్డ ఏడ్చుచు జనించును. పెరుగుటలో, జీవించుటలో అనంత దుఃఖము ననుభవించును. చివరకు దుఃఖముతో ఈ ప్రపంచమును వదిలి నిష్క్రమించును. జన్మించినది మొదలు మరణించువరకు అను క్షణము మానవ జీవితము దుఃఖమిశ్రితమై ఉన్నది. అయినను మాన వుడు ఈ సత్యమును ఎరుగలేక అనిత్య సుఖములవెంట పరుగు లిడుచున్నాడు. సంసారముపై తగని వ్యామోహమును పెట్టుకొని అల మటించుచున్నాడు ఆవేదన చెందుచున్నాడు. సంసార బాంధవ్యము లన్నియు అనిత్యమనెడి సత్యమును గాంచలేకున్నాడు.

ఎక్కడి సుతు లెక్కడి సతు
లెక్కడి బంధువులు సఖు లెక్కడి భృత్యుల్
డొక్కవడి పోవువేళఁ
జక్కటికిని నెవరురారు సహజము వేమా !

బిడ్డలు, భార్యలు, బంధువులు, చెలికాండ్రు అనెడి బంధములన్నియు మిథ్యయే. మనము ఈ ప్రపంచాన్ని నిష్క్రమించు నపుడు ఒక్కరు కూడా వెంటరారు. అట్టివారిపై మమకార మెందులకు ? అని మనస్సు నకు అవగాహనను కల్పిస్తున్నాడు వేమనయోగి. మమకారము అనర్థ మని ఇలా తెలియజేసి, ఇక దేహముతో తాదాత్మ్యము చెంది "నేను" అని కదిలెడి అహంకారమును గూర్చి తెలియజేయుచున్నాడు.

కడుపులోని మలము కడమవి యెముకల
కలదు మాంస మింత కప్పుతోలు
మలము నెత్తి మీఁద మానెట్టు కలుగురా
విశ్వదాభిరామ వినురవేమ !

Dr Dayananda Swamy ebooks

అహంకారమును కలిగించే దేహము యొక్క నిజస్థితిని వేమన పైపద్య ములో తెలియజేయుచున్నాడు. ఈ దేహములో మానవుని మోహింప జేయు వస్తువు ఏమున్నది? కడుపంతా దుర్గంధ భూయిష్ఠమైన మల ముతో నిండియున్నది. రక్తము, ఎముకలు, మాంసము, చర్మము తప్ప దేహములో విలువైన వస్తువు ఏమున్నది? ఇట్టి దేహమును మానవు లెలా ఆశించుచున్నారు? దేహభ్రాంతి యున్నవానికి మోక్ష మెలా సిద్ధించును? అని వేమన విస్మయ మొందుచున్నాడు.

కడుపులోని రోఁత కడు నోటియెంగిలి
కడుగ వశమె బ్రహ్మ కొడుకునకును
సత్యమున్నఁ గొంత జగతిపై సిద్ధించు
విశ్వదాభిరామ వినురవేమ !

కడుపులోని మలాన్ని ఎవరు కడుగ గలరు ? నోటిలోని యెంగిలిని ఎవరు నిర్మూలించ గలరు ? దేహమొక మలిన కూపము. ఈ విష యము నెఱింగి అహంకారమును వీడి చరించువానికి సత్యదర్శన మయ్యే అవకాశము కలదు అని వేమన తెలుపుచున్నాడు. అహం కారము చచ్చినా ఆత్మజ్ఞానము ఉదయించెనని భావము. అహంకార మును చంపలేని చదువులు ఎన్ని చదివినను ప్రయోజనము లేదు. అహంకారమును అంతమొందించునది ఆత్మజ్ఞాన మొక్కటియే. గుహ్య మైన రాజవిద్యయే విద్యలలో విద్యయైయున్నది.

సకల శాస్త్రములను జదివియు వ్రాసియు
దెలియఁ గలరు చావుఁ దెలియలేరు
చావుఁ దెలియలేని చదువు లవేలరా ?
విశ్వదాభిరామ వినురవేమ !

Dr Dayananda Swamy ebooks

సకల శాస్త్రములను చదివినవారును, రచనలు గావించువారును చదువుదురేగాని, చావు ఏమిటో చదువలేరు. చావును తెలిపి, బ్రతుకులో జీవమును నింపునది ఏదియో, అదియే నిజమైన చదువు అంటున్నాడు శ్రీ వేమన. సమస్త చదువులు జీవుని బహిర్ముఖ మొనర్చు చున్నవేగాని అంతర్ముఖుని గావించలేక పోతున్నవి. అంతర్ముఖత్వము లభించని వాడు ఆత్మనెలా పొందగలడు ? కనుక బాహ్య చదువులకు స్వస్తి చెప్పి, బుద్ధిని ఆంతర్యము వైపునకు త్రిప్పి, సత్యము నెఱింగి తరించమని వేమన తెలుపుచున్నాడు.

సతత మాత్మ రూపు సాధించి శోధించి
యుతము గాను బుద్ధినూని నొక్కి
గతిని గోరి ముక్తి గనుటయే లాభంబు
విశ్వదాభిరామ వినురవేమ !

ఆత్మదర్శనమునకై సదా ప్రయత్న పూర్వకముగా యత్నించుచూ బుద్ధిని వశపఱచుకొని హృదయములో ఆత్మను గాంచుటయే మోక్షము అంటున్నాడు వేమన.

కనుక శాస్త్రావగాహన ద్వారా మొదట చిత్తమునకు పరిపుష్టి కల్గించాలి. భావపుష్టి కలగాలి. జ్ఞానముతో చిత్తము విగురించగనే హృదయము పారవశ్యముతో కదులును. హృదయము పరవశించగనే జీవుడు దేవుడుగా మారిపోవును. గమనము, గమ్యము రెండునూ తన కన్నా అన్యముగాదని తెలియును. సాధకుడైన తాను సాధ్యమైన భగవానుడు ఇరువురును ఒకటే యనెడి అనుభూతి మిగులును.

Dr Dayananda Swamy ebooks

జన్మము నెత్తిన మనుజుఁడు
చిన్మయ పరిపూర్ణ మహిమఁ జిత్తము నెఱుఁగన్
దన్మయత నొంద నేర్చును
చిన్మయుఁ బరమేశు మదినిఁ జేర్చును వేమా !

సద్గురువు నుండి వేదాంత వాక్యములను, తత్త్వ విషయములను, భగవానుని కళ్యాణ గుణములను శ్రవణము చేయుటవలన చిత్తము చిన్మయ మగును. చిన్మయమైన చిత్తము భక్తిరసముతో తడిసి తన్మయ మగును. తన్మయమైన చిత్తము జ్ఞానముతో పండి తద్రూపమగును. తత్స్వరూపము, 'త్వం' స్వరూపము ఒకటి యగుటచేత "తత్త్వమసి" అనునది అనుభవ రూపముగా మిగిలిపోవును. ఇదియే సాక్షాత్కారము, ఆత్మ సాక్షాత్కారము.

కనుక బహిర్ముఖమయ్యే ఇంద్రియ మనోబుద్ధులను అంతర్ముఖము చేసినపుడే అక్షయమగు ఆనందము అనుభవమునకు అందును.

అంతరంగమందు నభవు నుద్దేశించి
నిల్పిచూడఁ జాడనిల్చుఁ గాక
బాహ్యమందు శివుని భావింప నిలుచునా ?
విశ్వదాభిరామ వినుర వేమ !

చిత్తమును అంతర్ముఖము చేసినపుడే మనిషి ముక్తుడగును. బాహ్య దృష్టితో ఎన్ని సాధనలను ఆచరించినను భగవత్కృపను పొందుట దుర్లభము. చిత్తమును అంతర్ముఖము చేయవలెననిన గురుదేవుని అనుగ్రహము మనపై పడవలెను. గురుమహిమ వర్ణనాతీతము. అద్భుతము.

Dr Dayananda Swamy ebooks

పట్టుఁగొమ్మ వదలి పలవింప నేటికి
ఇట్టి గురుని వేఁడి గుట్టు నెఱిఁగి
నిట్టనిలువు గాంచి నిర్గుణ మందరా
విశ్వదాభిరామ వినురవేమ !

పక్షి కొమ్మ నాధారముగా జేసుకొని మనుగడను సాగించునట్లు, శిష్యుడు ఆచార్యుని ఆధారమొనర్చుకొని జీవించవలెను. నిరాధారముగా ఎక్కువసేపు పక్షి నింగి నెలా సంచరించలేదో, గురుబోధ నాలంబన ముగా గొనని శిష్యుడు ఆధ్యాత్మిక రంగమున ఎక్కువకాలము చరించ లేడు. బ్రతుకులోని ఆవేదనా వేడి తొలగవలెనన్నచో గురువును వేడి, సత్యమును గ్రహించుటయే ఏకైక మార్గము. అగ్రాహ్యమైన విష యము గురుబోధలో సుగ్రాహ్యము కాగా శిష్యుడు నూతన శోభతో విరాజిల్లును. గుణములు గుర్తును కోల్పోవ గుణాతీతుడై మనగలు గును. గుణాతీతుడైన వానికి గుణముల పొత్తు కుదరనందున గుణ ములు గోచరించవు. గుణములు గోచరించని గుణరహితునికి గోచరిం చునది నిర్గుణమే గనుక, అలా గ్రహించే తానుకూడా నిర్గుణరూపుడై శోభిల్లును. గురుసాన్నిధ్యములో గుట్టు తెలియుననియు, అట్టి స్థితిలో గుణము లంతరించుననియు, నిర్గుణ స్వరూపము అనుభవమునకు అందుననియు వేమన తెలియజేయుచున్నాడు.

సాధకుడు సామాన్యుడే. సామాన్యుడైన తనలో ఎన్నియో దొసగలు దొర్లుచుండును. తన జీవితములో జరిగిన లేదా జరుగుచున్న తప్పులను గాంచి సాధకుడు కలత చెందును. దోషములను దర్శించి కలవరపడును. ఈవిధమైన మానసిక కలతలు సాధనను వక్రింప జేయును. దోషపూరిత జీవితమును తోషభరిత మొనర్చు కోవాలి.

Dr Dayananda Swamy ebooks

నిస్సార బ్రతుకును సారపూర్ణముగా తీర్చి దిద్దుకోవాలి. దానికి ఏకైక మార్గము గురుసేవయే నని వేమన అభిప్రాయ పడుతున్నాడు.

పాలఁ గలియు నీరు పాలయై రాజిల్లు
గొప్ప గురుని వలన కోవిదుఁడగు
సాధు సజ్జనముల సంగతు లిట్లురా
విశ్వదాభిరామ వినురవేమ

పాలరుచి నీటికి లేదు. పాలరంగు నీటికి రాదు. పాలరంగు తనకు లేదని, పాలరుచి తనకు రాదని నీరు కలత చెందనవసరములేదు. పాలలో కలిసిపోతే చాలు. కమ్మని రుచి, తెల్లని రంగు సహజముగా సిద్ధిస్తాయి.

అలాగే మనిషి జీవితము మాధుర్యమును కోల్పోయి ఉండును. అంతమాత్రాన వ్యథచెంద నవసరము లేదు. మాధుర్యమూర్తియైన మధురాధిపతిని మదిలో నింపుకొని చరించు మహాత్ముల సాంగత్యము నొందినచో మనుగడయే మధురముగా మారిపోవును.

పాలయొక్క సాంగత్యము వలన నీటికి రంగు, రుచి కలిగినట్లు గురుదేవుని సాంగత్య ప్రభావముచేత మానవుడు మాననీయుడై, మహాత్ముడై, మహాత్ముడగును. కోవిదుడగును. కవి యగును. క్రాంత దర్శి యగును.

నిస్సారమైన జలము తనలో కలిసిందని, తన రూపును సంతరించుకుంటున్నదని క్షీరము వ్యథచెందునా? అలాచేయదు సరిగదా తన వైభవమును నీటికి అందించి తృప్తి చెందును. అందుచేతనే క్షీరము ఎప్పుడూ ధవళకాంతితో శోభించుచుండును. తాను వైభవోపేతమైన జీవితమును సాగించుచు, తనను దరిజేరువారులను వైభవ

Dr Dayananda Swamy ebooks

ముతో నింపువారు సదా క్షీరము వలె స్వచ్ఛమైన కాంతిని కలిగి యుందురు.

అలాగే గుణహీనులైన జనులు తమను చేరినారని మహాత్ము లెన్నడూ భావించరు. పైగా వారిని గుణవంతులుగాను, గుణాతీతులు గాను తీర్చిదిద్ది సంతసింతురు. ఇదియే వారి కారుణ్య జీవనము. అట్టి మహాత్ముల సాన్నిధ్యములో శిష్యుని బ్రతుకు శిక్షణాయుతమై, రక్షణా యుతమై విరాజిల్లునని వేమనార్యుడు అభిప్రాయపడుతున్నాడు.

మఠములోని యోగి మాయలన్నియుఁ గోసి
ఘటములోన నున్న ఘనుని దెలిసి
మాట మాటకు గురు మఱువక దెలుపురా
విశ్వదాభిరామ వినురవేమ !

గురు సాన్నిధ్యములోనే జ్ఞానము లభ్యమగునని వేమన నిశ్చి తాభిప్రాయమును కలిగి యున్నాడు. మరి అట్టి గురుదేవు డెవరు? అను ప్రశ్నకు పైన తెలిపిన పద్యము సూటియైన సమాధానమై యున్నది.

జఠరాగ్నిని జయించలేని జీవుడు ఘటమే తానని భావించి కఠోర జీవితమును సాగించుచుండును. ఘటమైన శరీరము మట్టియే ననెడి మర్మమును దెలిసినవాడు, మాయనుండి విడిపడి తరించును. అట్టి ముక్తపురుషుని దేహము మఠమేగాని ఘటముకాదు. మాయను గోసే మహిమను తెలిసిన మహాత్ముడు ఘటములోనున్న దేముని పట మును గాంచును. ఘటరూపము మట్టియని, పటరూపము మహిమ యని తెలిసి మనుగడను సాగించును. బాహ్య వస్తుదర్శనము భ్రమ లకు నిలయము. ఆంతర్య వీక్షణము ఆనంద ఆలయము. హృదయ గుహలో నిండియున్న ఆత్మజ్ఞాన భాస్కర తేజమును గాంచి, తరించి,

Dr Dayananda Swamy ebooks

తన జ్ఞాన కిరణములను సర్వులపై విస్తరింప జేయు సద్గురుదేవుని మాటిమాటికి మనసులో మననము చేసుకోమని, ఆ మహాత్ముని వైభవమును భావించి భాషించమని, భాషించి భాసించమని వేమన నొక్కి వక్కాణించుచున్నాడు.

వెలుపులేక గురుని వేడుచు వేసారి
స్థిరముగాను పూజ చేసిచేసి
పరము గన్నవాడు పరిపూర్ణ యోగిరా
విశ్వదాభిరామ వినురవేమ !

వేమన తెలిపిన రీతిలో జీవించవలె నన్నచో సాధకుడు వైరాగ్యవంతుడై ఉండాలి. వైరాగ్యముతో కూడిన సాధనయే స్థిరముగా నిలుచును. స్థిరమైన పూజ దృఢమైన భక్తిని కలిగించును. దృఢభక్తి కోరికలను నిరోధించును.

" సా న కామాయ మానా నిరోధ రూపత్వాత్ "

"దృఢభక్తి నిరోధ రూపమై ఉన్నందున కోరికలను కదలనివ్వదు" వాంఛలుడిగిన మది ఇహలోక బంధముల నుండి విడిపడును. ఇహలోక సంబంధమైన భ్రాంతి తొలగగానే పరమాత్మ సంబంధమైన శాంతి హృదయములో భాసిల్లును. అట్టి పరరూప స్థితిని లేదా పరమాత్మను దర్శించినవాడే పరిపూర్ణయోగియని వేమన అభిప్రాయపడుతున్నాడు. అనుష్ఠాన పరుడై, అనుభవ జ్ఞానము నొందినవాడే నిజయోగి యని, నిర్మలయోగి యని వేమనార్యుని అభిభాషణము.

అనుభవములో నున్న ఆత్మను గూర్చిన జ్ఞానమును పొందుటయే తత్త్వావగాహన, ఆత్మ ఉన్నదియేగాని కానున్నది కాదు. ఉన్న దానిని దర్శించుటయేగాని లేనిదానిని పొందుట కాదు. జ్ఞానాంజనము

Dr Dayananda Swamy ebooks

ద్వారా మనసులోని భేదభావ చత్వారము తొలగగనే ఆత్మ అద్వ యమై గోచరించును. జ్ఞానమును అందించు అట్టి దివ్యాంజనము సద్గు రువు వెంతనే లభించునని వేమన తెలియజేయుచున్నాడు.

అంజనంబు కనుల కంటించి చూచిన
సొమ్ము దొరుకు భువిని సూత్రముగను
గురుని నమ్మ కరుణ గుణమంటి చూడరా
విశ్వదాభిరామ వినురవేమ !

భూమిలో నిక్షిప్తమై ఉన్న నిధిని దర్శించవలె నన్నచో ఒక విధమగు కాటుక పనిచేయునని పలుకు చుందురు. అలాగుననే గురుదేవుని సహా యముచేత అంతర్యమునందు నిక్షిప్తమైయున్న ఆత్మజ్ఞాన నిధిని నీవు పొందగలవు అంటున్నాడు వేమనయోగి.

నిధి నిక్షేపాలు భూమిలో యుండునేగాని నిధి భూమికాదు. అలాగే ఆత్మను అంతర్యములో దర్శించవచ్చును గాని అంతఃకరణ ఆత్మ కానేరదు. భూమిలోని నిధి నిక్షేపాలను చూడవలెనన్నచో ఒక విధమైన కాటుక ఉపకరించును. అలాగే హృదయ గుహయందు వెలుగు ఆత్మను దర్శించవలె నన్నచో జ్ఞానమనెడి కాటుక ఉపకరిం చును. భూమిలో నున్నను నిధి మలిన పడుటలేదు. మురికి గుంటలో ప్రతిబింబించినంత మాత్రాన సూర్యుడు మురికిగాడు. అలాగే దేహేం ద్రియ మనోబుద్ధులలో ప్రతిఫలించే ఆత్మకు కూడా ఎలాంటి మాలి న్యము అంటదు.

జ్ఞానమనునది స్వయం కృషిచేత లభ్యమయ్యేది కాదు. అది గురుబోధ ద్వారానే అందాలి.

Dr Dayananda Swamy ebooks

" శాస్త్ర జ్ఞోపి స్వతంత్రేణ బ్రహ్మాన్వేషణం న కుర్యాత్ "

"శాస్త్ర పండితుడైనను తనకు తానుగా బ్రహ్మాన్వేషణము చేయరాదు" అని శ్రీ శంకరులు తమ భాష్యములో తెలిపి యున్నారు.

కనుక్క గురువు చెంత లభ్యమయ్యే జ్ఞానాంజనము ద్వారా హృదయ గుహాయందిమిడియున్న ఆత్మను దర్శించమని వేమన తెలియజేయుచున్నాడు.

జ్ఞానము నందించి మన జీవితమునకు ధన్యత నొసగూర్చు గురువునకు ఏమి సమర్పించవలెను ? ఈ విషయమును తెలుపుచూ శ్రీ వేమనయోగి

ఇహమునందు గురున కీదేహ మిచ్చిన
పరముఁ జూపి గురుతుఁ బట్టి యిచ్చు
స్థిరముగాను బుద్ధి చెడనీక చూడరా
విశ్వదాభిరామ వినుర వేమ !

గురువు జ్ఞానము నందించును. అట్టి గురుదేవునకు ఇహమునందు మనము దేహము నొసంగినచో గురువు మనకు పరమును జేరు ఉపాయమును తెలియజేయును. తెలిసిన తరువాత బుద్ధిని నిశ్చలముగా నుంచుకొని తరించాలి.

గురువునకు దేహము నొసంగుట యనగా దేహాభిమానమును ఇచ్చుట అని భావము.

" అవ్యక్తాహి గతిర్దుఃఖం దేహవద్భి రవాప్యతే "

"దేహాభిమానము గలవారికి అవ్యక్తమునందు మనస్సు సులభముగా నిలువదని గీతయందు తెలుపబడినది. కనుక దేహాభిమానమును గురు

Dr Dayananda Swamy ebooks

జననీ జనకులు ప్రసాదించిరేగాని జన్మబంధములనుండి విడుదలను కల్పించలేక పోయిరి.

జ్ఞానము నందించి, జన్మ సంసార బంధముల నుండి విముక్తి చేసి, మనలను ఆత్మవిదులుగా మార్చి తరింపజేయు కరుణామయుడు గురుదేవుడే అయినందున సద్గురువు సర్వులకన్నను శ్రేష్ఠుడని, సర్వోత్తముడని వేమన స్తుతించుచున్నాడు.

గురుబోధ లేక గుర్తు తెలియుట భ్రమయని వేమనార్యుడు అభిప్రాయ పడుచున్నాడు. గురువు లేకుండా ఏవిద్య నైనను పొందవచ్చునేమో గాని ఆత్మవిద్యను అందుకొనుట మాత్రము సాధ్యము కాదని వేమన తెలుపుచున్నాడు.

ఈఁదవచ్చు నేరు బాధలేకుండనే
యాదిగురువు లేక యందరాదు
సోదిఁ జెప్పుచేల చొక్కిన మది చూడు
విశ్వదాభిరామ వినురవేమ !

ఈత రానివాడు ఏటి నీదలేడు. ఈత నేర్చువాడు నీచేత ఈదించగలడు. ఎవ్వరు నేర్వకున్నను, పరిశీలన ద్వారానో, లేదా పదేపదే ప్రయత్నించుట ద్వారానో ఈతను నేర్వవచ్చును. కానీ గురువు లేకుండా జ్ఞానమును అభ్యసించలేము.

అన్యమైన విద్యలన్నియు అంతఃకరణకు సంబంధించినవే. మనస్సు బహిర్ముఖమై బాహ్యము నందలి విద్యలను గడించును. కానీ ఆత్మవిద్య విషయము వేఱు. అది మనోబుద్ధులను దాటిన స్థితిలో అందును. అందుచేత మనస్సులేని దశలో తెలియవచ్చెడి ఆత్మ జ్ఞానమును మనస్సు ద్వారా పొందేందుకు వీలులేదు గనుక అట్టి జ్ఞానమును మహాత్ముల బోధద్వారానే గ్రహించాలి.

Dr Dayananda Swamy ebooks

హరికృపా తబ జానియే దేహానవ్ అవతార్
గురుకృపా తబ జానియే ఛుడావే సంసార్

"భగవానుని కృపచేత గురుదేవుడు మానవ దేహముతో గోచరిస్తాడు. గురుదేవుని కృపచేత మనము సంసార సాగరము నుండి బయటపడి తరిస్తాము" అని భక్త కబీర్‌దాస్ ప్రవచిస్తాడు.

గురుదేవుడు లభ్యమాయెనా? ఇక బ్రతుకు గట్టున పడిందనే భావించాలి. గురుదేవుడు నీపాలిటి కామధేనువై సర్వమును సమకూర్చి సర్వోత్తమ స్థితిని ప్రసాదించును.

గురుడు దనఁగ ధేనువై తగు
వరశిష్యుడు వత్సమగుచు వర్తింపంగా
దఱి గలిగినప్పు డొసఁగును
నిరుపమ లక్ష్యామృతంబు నిజముగ వేమా!

గురువు ధేనువు వంటివాడు. శిష్యుడు లేగదూడవంటి వాడు. దూడ స్థితిని గనిపెట్టి ధేనువు పాలిచ్చునట్లు, గురుదేవుడు సమయమును జూచి జ్ఞానము నందించును. అనుకూల సమయమున నాటబడిన విత్తనము చక్కగా మొలకెత్తునట్లు, అనువైన దశలో అందించబడిన జ్ఞానము ఫలప్రదమై శిష్యుని తరింపజేయును. అట్టి అనువైన దశను, కాలమును గురువు ఎన్నుకొనును. అంతవరకు కినుక వహించకుండా ఉండే నేర్పును, సహనమును శిష్యుడు అలవరచుకోవాలి.

గురువు, జ్ఞానము అనునవి రెండుకావు. గురువు లభించగనే జ్ఞానము అందించ బడినదని భావము. ఈ విషయమును వేమన చక్కగా వివరించును.

Dr Dayananda Swamy ebooks

గురువు చిల్లగింజ కుంభ మీదేహంబు
ఆత్మ కలుషపంక మడుగుఁ బట్టు
తేరి నిలిచెనేని దివ్యామృతమ్మురా
విశ్వదాభిరామ వినురవేమ !

మనదేహము మలిన జలముతో నిండిన మట్టికుండ. కుండలోని మాలిన్యమే అజ్ఞానమనెడి జీవభ్రాంతి. గురుదేవుడు చిల్లగింజ లాంటివాడు. చిల్లగింజవాడి నీటిలోని మాలిన్యమును దూరముచేసి జలమును శుద్ధి పరచునట్లు గురుదేవుడు మనలోని పాప పంకిలమును దూరముచేసి మనలను పవిత్ర మొనర్చును.

చిల్లగింజను గంధముగాతీసి దానిని నీటిలో కలుపుటవలన నీటియందలి మాలిన్యమంతయు తొలగి నీరు శుభ్రపడును. సాధారణముగా వర్షాకాలమునందు బురదతో కూడియున్న నీటిని శుభ్రపరచుటకు ఈ విధమైన శుద్ధిప్రక్రియను అవలంబించు చుందురు. అలాగే చిల్లగింజ గంధమువలె గురుదేవుడు మనలోని మాలిన్యమును శుభ్రపరచును అని వేమనయోగి తెలియజేయుచున్నాడు. ఈ విషయమునే శ్రీ శంకరులు కూడా తమ ఆత్మబోధ యనెడి గ్రంథములో తెలియజేయుదురు.

అజ్ఞాన కలుషం జీవం జ్ఞానాభ్యాసాత్ వినిర్మలం
కృత్వా జ్ఞానం స్వయం నశ్యేత్ జలం కతక రేణువత్ !

"మురికి నీటిని పరిశుద్ధమొనర్చిన చిల్లగింజ గంధము తిరిగి నీటియందే కలియు విధముగ దోషపూరితుడైన జీవుని పరిశుద్ధునిగా చేసి, తిరిగి జ్ఞానము ఆత్మయందే లీనమగు చున్నది" అని ఆచార్యులవారు ఆత్మబోధ యందు తెలిపియున్నారు.

ఇచ్చట గురుదేవుని వేమన చిల్లగింజ గంధముతో పోల్చినాడు. శ్రీ శంకరాచార్యులవారు జ్ఞానమును చిల్లగింజ గంధముతో పోల్చి చూపినారు. దీనినిబట్టి చూడగా గురువు, జ్ఞానము రెండును వేఱుగాదని తెలియుచున్నది.

Dr Dayananda Swamy ebooks

కామ జయము

గురువు వెంత ఆసీనులై జ్ఞానము నభ్యసించి ఆత్మారాములై తరించవలెననిన కాముని బారినుండి బయట పడాలి. కామం నిండిన హృదయములో రాముడు నిలువలేడు. ప్రతి ఆధ్యాత్మిక సాధకుడు కామ విషయంలో జాగరూకుడై ఉండాలి.

ముదిత వలపుఁ జూడ మోహింత్రు వారల
చెంతఁ జేరఁగానె చెడును మనసు
వింత భ్రమ గుణంబు కాంతఁ జూచినఁ జాలు
విశ్వదాభిరామ వినురవేమ !

హావ భావ విన్యాసముల ద్వారా వలపును ప్రకటించు స్త్రీ రూపమును గాంచగనే మనుజులు మోహితు లగుచుందురు. కాంతను చూడగనే అంతరంగమున కాంతి ఆరి, శాంతి మారిపోవును. కనుక భ్రమలు గొలిపే స్త్రీ విషయములో సాధకుడు అతి జాగ్రత్తతో మెలగాలి.

మృగతృష్ణలో జలము గోచరించవచ్చు. పరిశీలనలో అయ్యది భ్రాంతి యని తేలును. అలాగే స్త్రీ సౌందర్యము నిత్యమనెడి భ్రాంతి మనస్సుకు కలుగుతుంది. కానీ కాస్త పరిశీలించి చూచినచో అది అంతయూ మాయావరణయే నని తేలుతుంది. రక్త మాంసాలతో నిండి, చర్మపు పొరచే కప్పబడిన దుర్గంధపూరిత మలిన కూపమని అర్థమవుతుంది. అట్టి శరీరము విసర్జనీయమేగాని వాంఛనీయము కాదని బోధ పడుతుంది. బుద్ధిలో బోధ నిండినపుడే కామమును జయించ గలము.

Dr Dayananda Swamy ebooks

రూపు నడకఁ జూడఁ దాపంబు పుట్టిన
భ్రాంతు లంకురించు నంతలోనే
బుద్ధి మఱలకున్న రద్దికి నెక్కురా
విశ్వదాభిరామ వినురవేమ !

స్త్రీల రూపము, వారి నడక గోచరించగనే అంతరంగము భ్రాంతికి లోనై కలత చెందును. బుద్ధి ద్వారా విచారించి ఈ ప్రమాదము నుండి బయట పడవలెను. లేనిచో బ్రతుకే పతనమగును అని వేమన హెచ్చరించుచున్నాడు.

కామము నేత్రములను పాడుచేయును. స్త్రీ సౌందర్యమును నేత్రములు దర్శించగానే మనస్సు పాడై పోవును. ఆవేశజనిత అయోమయ స్థితిలో కొట్టుమిట్టాడు చుండును. మదపుటేనుగు వలె విజృంభించును. పరాకాష్ఠ నొందిన ఉన్మత్తుని వలె చెలరేగును. నిగ్రహించను వీలుగాని స్థితిలో మనస్సు నిలిచియున్నపుడు దానిని నిగ్రహించు మార్గమేమి ? బుద్ధిలో అవగాహనను నింపుటయే. నిత్యానిత్య వస్తువివేకము బుద్ధిలో చోటు చేసుకోగానే మనస్సు కుదుటపడి నిగ్రహించబడును. మల మూత్రాదులతో దేహము ఎలా నిండియున్నదో, మలిన భాండమై యున్నదో సాధకుడు చక్కగా విచారించాలి.

ఉచ్చలోనె పుట్టి యుచ్చలోనె పెరిఁగి
యుచ్చ కాసపడుట యుచిత మగునె
యుచ్చ రోయువాఁడె యుత్తమ యోగిరా
విశ్వదాభిరామ వినురవేమ !

Dr Dayananda Swamy ebooks

మూత్రభాండము నుండి బయల్వెడలి, పెరిగే తన దేహమును మూత్రముతో నింపుకొని, మూత్రస్థానము కొరకు వెఱ్ఱెత్తి పోవుట సముచితమైన విషయమా ? అని వేమన సూటిగా ప్రశ్నిస్తున్నాడు

బురదలో పొరలే పందికి మనిషికి తేడా ఏమిటి అని నిలదీసి అడుగుచున్నాడు. మనస్సును పొందిన మనిషి పశు పక్ష్యాదులవలె లైంగికావేశముతో జీవించుటగాక విచక్షణా జ్ఞానముతో కామమును జయించి, నిర్మల మనస్కుడై తరించవలెనని వేమన ఉపదేశించు చున్నాడు. స్త్రీల వలపుకు సంబంధించిన తలపులు కల్లయని తెలుపు చున్నాడు.

"కల్లసుమీ సతుల వలపు గనుఁగొన వేమా !"

అని వేమనార్యుడు హెచ్చరిక చేసినాడు.

మనుజుడు తానెంత గొప్ప సాధకుడైనను కామ జయము జరిగిందని భావించకూడదు. అది ఏ క్షణమైనను విజృంభించి మానవుని మతిభ్రష్టుని గావించును.

ఎట్టి యోగికైన నిల మన్మథావస్థ
తెలియవచ్చు నేని తేటగాను
యోగమెల్ల నుండి జోగియై పొడగు
విశ్వదాభిరామ వినుర వేమ !

కామ వికారములు మనస్సులో కదలగానే ఎంతటి యోగియైనను పొడగును. పెద్దమంట లేచినను నీరు పోయగనే ఆరిపోవునట్లు కామ పిశాచము మనస్సులో కదలగానే జ్ఞాన జ్యోతి ఆరిపోవును. యోగ మార్గములో చరించు ఉత్తమ సాధకుడు కూడా పతనమయ్యే అవకాశము కలదు అని వేమన తెలియజేయు చున్నాడు.

Dr Dayananda Swamy ebooks

కాయమున్న యప్డె కామాదులను గోసి
జ్ఞాన మార్గమునకుఁ గడఁగ వలయు
జాగుచేయఁ గాయమేగిన నేమగు
విశ్వదాభిరామ వినురవేమ !

కామము దేహస్థాయిలో వ్యక్తమగు చుండును. దేహమున్నది కామ తృష్ణను తీర్చుకొనుటకు కాదు. దహించబడునది ఏదియో అదియే దేహము. దేహము ఆరోగ్యముగా యున్నదని కామవాంఛలను కలిగి పతనము కాకూడదు. శరీర పటుత్వము తొలగక మునుపే పరమాత్మను తెలుసుకొను మార్గమును అన్వేషించాలి. ఈ విషయములో ఆలస్యము విషతుల్యమని సాధకుడు మరువకూడదు. జాగుచేసినచో అవకాశము జారిపోవును. బ్రతుకు మారిపోవును. ఆయువు కారిపోవును. జ్ఞానజ్యోతి ఆరిపోవును. కనుక కాయము ఆరోగ్యముగా నున్నపుడే కామమును జయించి, శమదమాదులను కలిగి శాంతిరూపుడై తరించ వలెనని వేమనార్యుడు హెచ్చరించుచున్నాడు.

భార్యాభర్తలు కూడా కామము విషయములో జాగరూకులై ఉండవలెనని వేమన హెచ్చరిస్తాడు. మోక్షప్రాప్తికి సాధనమైన గృహస్థాశ్రమమును రొంపి సంసారముగా తయారు చేసుకోకూడదని వేమన అభిప్రాయము. ఒక్క సంతానమే వాంఛనీయమనియు, అది కూడా కామతృప్తి కొరకు గాక జీవన స్రవంతిని కొనసాగించు కొరకే ఉద్దేశించ బడవలెనని వేమన నిర్ణయిస్తాడు. ఒక పిల్లవాడు కలగగానే భర్త భార్యను తల్లిగా భావించవలెనని వేమన ఋషి తెలుపుతాడు.

Dr Dayananda Swamy ebooks

తల్లి గర్భమందు దాఁ జనియించియు,
దనదు భోగసతికి దానెపుట్ట
దల్లు లిర్వురయ్యు తను వొక్కటయ్యెరా
విశ్వదాభిరామ వినురవేమ !

తాను తల్లిగర్భము నుండి జనించును. తానే తన భార్య గర్భము నుండి బిడ్డగా ఉదయించును. కనుక మనుజునికి ఇరువురు తల్లులుంటారు. శరీరము ఒక్కటియే అయినను తల్లులు ఇరువురు అని వేమన తెలియజేయుచున్నాడు. బిడ్డగా తానే పుట్టినాడు గనుక భార్య ఆ తరువాత తల్లితో సమానము. ఆమెపై కామదృష్టి ప్రసరించ కూడదు. బిడ్డ కలిగిన తరువాత భర్త భార్యను తల్లివలె భావించాలి. మాతృదేవిగా మనస్సులో మననము చేసుకోవాలి.

మైథునమునఁ బుట్టి మానవులందఱు
తిరుగుచుందు రెపుడు తెరువులేక
యెందులోనఁ బుట్టు కందులోనే గతి
విశ్వదాభిరామ వినురవేమ

మానవుడు ఏకారణముగా జన్మించునో ఆ కారణముగానే మరణించుచున్నాడు. స్త్రీ పురుష మైథున కార్యము వలన జీవుడు జననము నొందుచున్నాడు. దుఃఖమయమైన జన్మమునకు ఏ మైథున కార్యము కారణమైనదో అట్టి దానియందే తిరుగ మనస్సు నుంచి నశించుచున్నాడు. జనన మరణాలకు కారణమైన లైంగికావేశమును అంతరింప జేసుకొని సుఖించమని వేమన తెలుపుచున్నాడు. కామమును జయించనివాడు ఎంత వాడైనను మోక్షమును పొందజాలడు.

Dr Dayananda Swamy ebooks

కాంచన విమోచనము

కామినీ కాంచనము లనెడి ఆటుపోటుల నుండి విముక్తి నొందిన వాడే శాంతి సాగరమును జేరి తరించగలడు. జన జీవనములో ఆర్థిక వ్యవస్థ అనివార్యమైనది. అవసరముల కొరకు ఉపయోగ పడవలసిన ఆర్థికము, అత్యాశను మానవు నిలో ప్రేరేపించి బ్రతుకును వమ్ము చేయుట శోచనీయము. నీచోన్నతములకు ఆర్థిక వ్యవస్థ కొలతబద్ద కావడము నేరము. ధన విషయమునందు వ్యక్తికి సరియైన అవగాహన లేకపోవుటయే ఈ దుర్వ్యవస్థకు కారణమైనది. ఈ దురవ గాహనను నిర్మూలించి దుర్వ్యవస్థను పారద్రోలే ప్రయత్న ములో వేమనార్యుడు చూపుబాట మనకు మిక్కిలి ప్రయోజన కారియై గోచరించుచున్నది. మనిషి జీవించుటకు గాలి, నీరు ఎలా అవసరమో, మనుగడకు ధనము కూడా అంతే అవ సరము. అయితే గాలి, నీరు విషయములో మనిషికి అత్యాశ ఎలాలేదో ధనము విషయములో కూడ అలాగే ఉండాలి. కాని మానవ సమాజము అందుకు భిన్నముగా చరించుచున్నది.

కనక మున్నవాఁడు కాముఁడు భీముఁడు
మిగులఁ దేజమంది మెలఁగు చుండు
విత్తహీనుఁడైన వెఱ్ఱులలో నేటు
విశ్వదాభిరామ వినుర వేమ !

ధనవ్యామోహానికి లోనైన మానవ సమాజము ధనానికి లేని విలువ నిచ్చి గౌరవించు చున్నది. అందువేత ధనవంతుడు సమాజంలో తేజో వంతుడై ఉన్నాడని వేమన తెలుపుచున్నాడు.

Dr Dayananda Swamy ebooks

ధనమున్నవాడు వికారముగా యున్నను జనుల దృష్టిలో మన్మ థునివలె గోచరించు చున్నాడని వేమన ఛలోక్తిని విసురుతున్నాడు. సిరిగలవానితో సరితూగగల వాడెవడూ లేకపోవుటచేత తానే సమాజ ములో భీమునివలె బలాఢ్యుడై ఉన్నాడు.

ధనికుడు ఎంత బాదస్తుడైనను వాని బాద స్తమునకు విశేష వ్యాఖ్యను అందించుటకు పండితలోకము ముందు కురుకును. ఉన్న సంపదతో లేని అనేక కల్పిత, ఆరోపిత శక్తులను కూడగట్టుకొని ధని కుడు ప్రకాశించుచుండును. ధనము లేనివాడు ఎంతటి విద్యావంతు డైనను సంఘములో ప్రకాశించ లేకున్నాడు. అందుచేతనే డబ్బుకు దాసోహమనిన ఈ ప్రపంచములో గొప్పవాడు కూడా ధనాశతో యాచకు డగుచున్నాడు అని వేమన విమర్శించుచున్నాడు.

కనక పర్వతమునఁ గాపురం బుండిన
ననిమిషేశ్వరునకు నాసపోదు
కనక కుండలములు కర్ణుని నడుగఁడా
విశ్వదాభిరామ వినుర వేమ !

ధనవ్యామోహము అవాంఛనీయ మనియు, అది చికిత్సలేని వ్యాధి అనియు, ధనాశకు అంతమంటూ లేదనియు వేమన పలుకుచున్నాడు.

దేవేంద్రుడు స్వర్ణగిరిపై నివసించు చుండెను. అతనికి కాంచ నమునకు కొఱత ఎక్కడున్నది? అయిననూ ధనాశ చాలా పెద్దది. అది ఆరని మంట లాంటిది. అందుచేత తాను బంగారు కొండపై నివసించు చున్నను అతని యందున్న ధనవ్యామోహము ఇంద్రుని యాచకునిగా జేసి కర్ణుని కవచ కుండలములను అర్థించునట్లు జేసినది అంటున్నాడు వేమన.

Dr Dayananda Swamy ebooks

ధనము చంచలమైనది, అస్థిరమైనది. అది ఒకచోట నిలువదు. ఒకరిదంటూ ఉండదు. అది చెట్ల నీడవంటిది. అస్థిరమైన ధనము స్థిరమైన ఆనందమును పంచునని భ్రమచెందుట దుఃఖకరము.

కలిమి కలిగియుండి కఠిన భావముఁ జెంది
తెలియలేరు ప్రజలు తెలివిలేక
కలిమి వెన్నెల గతిఁ గానంగ లేరయా
విశ్వదాభిరామ వినురవేమ !

సిరియే సరియని నమ్మి గిరిశిలలవలె కఠిన మనస్కులై జనులు చరించుచుందురు వెన్నెలకు క్షీణదశ ఎలా సహజమో సంపద కూడా అంతేనని వారు గ్రహించలేరు అంటున్నారు వేమన యోగి.

చావు నేడో రేపో జతపడి వచ్చును
పెక్కునాళ్ళు కూడఁ బెట్టనేల
అనుచు నాశ లుడిగి నంతటి వారేరి ?
విశ్వదాభిరామ వినురవేమ !

పుట్టిన ప్రతివ్యక్తి మరణించక తప్పదు. ప్రయాణముచేయు వాని కొరకు విరామ స్థానము ఎదురు జూచునట్లు, జీవించు ప్రతి ప్రాణి కొరకు శ్మశానము ఎదురు చూచుచున్నది. ఆయువు ప్రతిక్షణము క్షీణించుచున్నది. నడిచే కాలము మనిషిని కాటికి నడిపిస్తున్నది. అశాశ్వతమై, క్షణికమై తెలియవచ్చు ఈదృశ్యమాన జగత్తుపై ఆశను పెంచుకొని ధనమును దాచుకొనుట సబబా యని వేమన సూటిగా ప్రశ్నించుచున్నాడు. ధనార్జన దుఃఖరూపమే గాని శాంతిప్రదము కాదని అభిప్రాయ పడుతున్నాడు.

Dr Dayananda Swamy ebooks

ధనమును సేకరించుటయందు బహు కష్టము నిండి యున్నది. దానిని దాచుట యందు కూడా దుఃఖమే నిండియున్నది. దానిని పోగొట్టుకొనినచో దుఃఖమే మిగులుచున్నది. దుఃఖమును నిర్విరామంగా పంచెడి ధనముపై వ్యామోహము ఉండదగినది కాదని వేమన పలుకుచున్నాడు.

తరుణి సుతులు ధనము ధాన్యముల్ సంపద
లెంత చుట్టుకొనిన నంత చేటు
పసిరికాయ పురుగు పద్ధతి గానరో
విశ్వదాభిరామ వినురవేమ !

భార్యాపుత్రులు, ధనధాన్యములు, చక్కగా, చిక్కగా నున్నవని జనులు సంతస పడుచుందురు. అవి కాటువేసే బాంధవ్యాలని, చేటుచేసే చుట్టరికాలని గ్రహింపలేరు. పసిరికాయ పురుగు తన నోటియందలి లాలాజలముతో దారమును తీయును. దారమును చిక్కులేకుండా చుట్టవలెనని చేసెడి ప్రయత్నములో తన కాళ్ళకే బంధములను తగిలించుకొనును. తగలబడి పోవును. బ్రతుకును వమ్ముచేసే చుట్టరికాలు, సంపదలు బంధాలేగాని నీకు ప్రియబాంధవ్యాలు కానేరవు.

ధన వ్యామోహమునకు లోనైన మానవుడు లుబ్ధుడగును. అట్టివాని సొమ్ము దేనికీ కొఱగాక నిరర్థక మగును.

తాను గుడువలేఁడు తగవేది యాప్తులఁ
జేరనీయఁ డట్టి చెనఁటి పశువు
చేనిలోన బొమ్మఁజేసి కట్టిన యట్లు
విశ్వదాభిరామ వినురవేమ !

Dr Dayananda Swamy ebooks

ధన వ్యామోహానికి లోబడిన లోభి కూడబెట్టిన ధనమును తాను అనుభవించడు. ఇతరులను అనుభవించనీయడు. అతడు పశువులాంటి వాడు అని వేమన పలుకుతూ, అలా పోల్చుటవలన పశువు బాధపడునేమో యని సంకోచించి, పొలములో కట్టి ఉంచిన గడ్డిబొమ్మతో సమానుడని విమర్శించుచున్నాడు.

పొలములో గడ్డిబొమ్మను ఉంచుదురు. ధాన్యమును ఆ బొమ్మ ఆరగించదు. అది ఉండుట వలన మనిషి ఉన్నట్లు భయపడి పశువులు పొలములో ప్రవేశించవు. అలాగే లోభికూడా నిర్జీవ ప్రతిమయై తాను అనుభవించక, ఇతరులను అనుభవించ నీయక నిరర్థకముగా బ్రతుకుచుండును.

ఇంటిలోని ధనము నిది నాది యనుచును
మంటిలోన దాఁచు మంకుజీవి
కొంచు బోఁడు వెంట గుల్లకాసును రాదు
విశ్వదాభిరామ వినురవేమ !

ధనమెప్పుడూ సద్వినియోగం కావాలి. ధనమును దాచకూడదు. ఒకరు దాచిన ధనమును దోచేందుకు మరొకరు సిద్ధపడియే ఉందురు. ఈ సత్యమును తెలియలేని కొందరు లుబ్ధమానవులు నిధిని నిక్షిప్తము చేయుచుందురు. భూమిలోనో, బ్యాంకులోనో దాచుచుందురు. పర్యవసానమేమిటి? తాను కాటికి కదిలిపోగానే కూడబెట్టిన ధనమంతయు పరుల పాలగును. తాను ఒక్క పైసనైనను వెంట తీసుకొని పోజాలడు. తాను అనుభవించక, ఇతరులకు అందించక ధనమును నిరుపయోగముగా ఉంచెడి అనాచారము విసర్జనీయమని వేమన పలుకుచున్నాడు. పేరాశను వీడనివాడు పరమాత్మని పొందలేడు.

Dr Dayananda Swamy ebooks

చదువులందుఁ బాడి సౌఖ్యము లందును
పెదవులందు రాజ్య పదవులందు
నాశ ఉడిగినట్టి యయ్యలు గలరొకో
విశ్వదాభిరామ వినుర వేమ !

చదువులు, సుఖ సంపదలు, ఇంతుల పెదవులు మరియు రాజ్యపదవులు ఇవి అన్నియు సాధారణముగా వ్యక్తిని మోహసముద్రమున పడవేయుచుండును. పైన తెలిపిన మోహముల నుండి బయట పడిన వారు అతితక్కువగా నుందురు అని వేమన తెలియజేయుచున్నాడు. ఇచ్చట వేమన నిరసించునది ధనాశనేగాని, ధనమును కాదు. ధనము యొక్క ఆవశ్యకత మానవునికి ఉన్నది అని వేమన అంగీకరిస్తాడు. కానీ ధనముపై అత్యాశ అవాంఛనీయమని తెలుపుతాడు.

చమురు గల్గుదివ్వె సంతోషముగ వెల్గు
ధనము గల్గువాని తలఁపు వెలఁగు
ధనము లేనివాని తలఁపులు తీరునా
విశ్వదాభిరామ వినుర వేమ !

చమురుగల దీపమే చక్కగా వెలుగును. ధనముగల వాని సంకల్పాలే చక్కగా నెరవేరును. సత్కార్యాలు లాచరించవలె ననెడి సంకల్పములున్నను ధనహీనుడు వాటికి ఆకృతిని కల్పించలేడు. ధనవంతుడే ధర్మకార్యములు చేయగలడు. కానీ చమురు ఉండి వెలగలేని దీపము నిరుపయోగమే కదా ! ఎందుకని ఆ దీపము ప్రకాశించదు ? అందులో వత్తిలేకపోవుటయే. అలాగే ధనమనెడి చమురు ఉండి నను త్యాగమనెడి వత్తి లేనపుడు జీవనజ్యోతి ప్రకాశించదు. త్యాగము

Dr Dayananda Swamy ebooks

లేని భక్తి నిరుపయోగము. ఈ విషయమును వేమన చక్కగా తెలుపుచున్నాడు.

నారాయణ యనవచ్చు నమశ్శివ యనవచ్చు
మేలువారిఁ జూచి మెచ్చవచ్చు
కొంగు కాసువిడిచి గొబ్బున నీరాదు
విశ్వదాభిరామ వినురవేమ!

కొందరు సదా నారాయణ జపమును చేయుచుందురు. మరికొందరు శివ భజన చేయుచుందురు. గొప్పవారిని పొగడుచుందురు. త్యాగులను శ్లాఘించు చుందురు. కానీ తాము మాత్రము పొరపాటున కూడా పైస దానము చేయరు శ్రీరంగ నీతులకు అలవాటుపడిన ఈ శ్రీమంతులు. భక్తులు నిష్ప్రయోజకులు అని వేమన అభిప్రాయము. ఇచ్చట ఇంకొక సత్యమును కూడా వేమన తెలుపుచున్నాడు.

పూర్వజన్మమందు పుణ్యంబు సేయని
పాపి తా ధనంబుఁ బడయలేఁడు
విత్త మఱచి కోయ వెదకిన చందంబు
విశ్వదాభిరామ వినురవేమ!

పుణ్యముంటే గాని సంపదలు దరిచేరవు. గత జన్మలలో ఆచరించిన పుణ్యకార్యములే ఈ జన్మలో సంపదలను అందించును. పుణ్యము లేనివాడు, పాపాత్ముడైన వాడు సంపదను పొందలేడు. విత్తనములు చల్లవలసిన సమయాన ఆపనిని చేయక, కోతసమయాన పైరును కోయుటకు కొడవలి చేతబట్టుకొని ముచ్చట ఎలాంటిదో, పుణ్యము లేకుండా సంపదలను ఆశించుట కూడా అలాంటిదే. కనుక పుణ్యము వలన

Dr Dayananda Swamy ebooks

లభించిన సంపదను పుణ్యకార్యములకు వినియోగించువాడే పుణ్యాత్ముడు అని వేమన తెలుపుచున్నాడు. కనుక ధనమును మనుజుడు సంపాదించియే తీరవలెను. అయితే అలా సంపాదించిన ధనముతో పాపాచరణము నాచరించుట గాని, లోభత్వమునకు నాంది పలుకుట గాని చేయకూడదు. సంపద విలువను సంపూర్ణముగా గ్రహించి జీవించాలి. జీవించి తరించాలి.

ధనమౌ మూలము జగముకు
ధనమౌ మూలంబు సకల ధర్మంబునకున్
గుణములు మూలము సిరులకు
మనమౌ మూలంబు ముక్తి మహిమకు వేమా !

ఈ ప్రపంచమునందు ధనములేనిదే ఏకార్యము జరుగదు. సమస్త కర్మలకు ధనమే మూలమై ఉన్నది. ధర్మకార్యము లాచరించ వలెనని భావించినను ధనములేనిదే ఆకార్యము నెరవేరదు. అట్టి ధనము గుణము ననుసరించి వచ్చును. సద్గుణ వంతులమై సత్కార్యము లాచరించినచో ధనము చేకూడును. కనుక సంపదలకు సద్గుణములు కారణము. ముక్తిని బొందుటకు మనస్సే కారణమై ఉన్నది అని వేమనార్యుడు పలుకుచున్నాడు.

Dr Dayananda Swamy ebooks

మనోనిగ్రహము

మనస్సును జయించినపుడే వ్యక్తి ముక్తుడగునని వేమన స్పష్టముగా తెలియజేస్తాడు. బంధముగాని, ముక్తిగాని మనస్సులో నున్నవియేగాని మనస్సునకు అన్యముగా లేవని తెలుపుతాడు. ఆధ్యాత్మిక సాధకునకు మనోనిగ్రహము ఉండి తీరాలని వేమన అభిప్రాయము.

మాట లుడుగకున్న మంత్రంబు దొరకదు
మంత్ర ముడుగకున్న మది కుదురదు
మనసు నిలుపకున్న మరి ముక్తి లేదయా
విశ్వదాభిరామ వినురవేమ !

వాచక జపము నుండి మౌన జపమునకు, మౌనజపము నుండి మనో లయమును పొంది సాధకుడు తరించ వలెనని వేమన అభిప్రాయము. మనసు చరించినంత వరకు మనిషి బంధములోనే ఉండుననియు, మనస్సు ఆగినపుడే మోక్షానుభూతి యని వేమన తెలియజేస్తాడు.

చిత్తమనెడి వేరు శిథిల మైనప్పుడే
ప్రకృతి యనెడి చెట్టు పడును; పిదప
కోర్కెలనెడి పెద్ద కొమ్మ లెండునుగదా
విశ్వదాభిరామ వినురవేమ !

ప్రకృతి మాయకు లోనై మానవులు సంసార వృక్షమును ఛేదించలేక బాధ లనుభవించు చుందురు. వాసనలనెడి భీభత్స గాలులు వీచుచుం

Dr Dayananda Swamy ebooks

డగా, కోర్కెలనెడి కొమ్మలు అల్లాడు చుండును. ఈ వృక్షమును అసంగ శస్త్రముచే ఖండించమని భగవద్గీత తెలియజేసింది. విషయ సంగత్వము మదిలో దూరము కాగానే మది నశించును. మనస్సును సిలుపుట యనగా మనోలయమని వేమన అభిప్రాయముకాదు. వేమ నార్యుడు తెలుపునది మనోనాశమేగాని మనోలయము కాదు. కనుక చిత్తమనెడి వేరు నశించగానే సంసార వృక్షము కూలిపోవుననియు, కోర్కెలనెడి పచ్చని కొమ్మలు ఎండిపోవుననియు తెలియ జేయు చున్నాడు.

> మనసులోన పుట్టె మాయ సంసారము
> మనసు విరిగెనేని మాయతొలగు
> మనసు నిల్పెనేని మహిదానె బ్రహ్మము
> విశ్వదాభిరామ వినురవేమ !

సంసారమునకు మాయయే ఆలంబనమని వేమన అభిప్రాయము. మాయను దూరం చేయవలెనన్నచో మనస్సును నశింపజేయాలి. మాయ మనస్సులోనే ప్రతిబింబించును. మనస్సు నశించగానే మాయ అంత రించును. మనిషి తరించును. అలా మనస్సును నిగ్రహించిన మహితా త్ముడు బ్రహ్మమే యగుచున్నాడు అని వేమన పలుకుచున్నాడు. బంధ మును కలిగించు మనస్సుయొక్క నిజ అందమును గమనించి చూడ గనే మనస్సు వికారముగా గన్పట్టును. వికారమునకు ఆధారమైన ఆకారమును గాంచగనే వికారములు అదృశ్యమై స్వరూప జ్ఞానము అనుభవముగా తెలియును.

మనోనాశము జరిగి మాయ అంతరించవలె ననిన మనో వృత్తు లన్నియు బ్రహ్మకార వృత్తులుగా మారవలెను. ఇదియే ధ్యానము

Dr Dayananda Swamy ebooks

ధ్యానఫలము. భగవంతుని బుద్ధిలో నిలుపుకోగానే మనస్సు నశించును. మాయ అంతరించును.

చేసి కంటివానిఁ జెంపార మదిఁజేర్చి
పూజ చేయవలెను బుద్ధి నిలిపి
యాత్మ పూజకంటె నదనంబు లేదయా
విశ్వదాభిరామ వినురవేమ !

ముక్కంటి యగు మహేశ్వరుని మదియందు స్థిరముగా నిలుపుకొని అర్చింపవలెనని వేమన తెలుపుచున్నాడు. దీనిని మించిన విశిష్టపూజ విశ్వమునందు మరియొకటి లేదని వేమన తెలుపుచున్నాడు. సాధారణముగా పూజలన్నియు దృష్టిని బహిర్గత మొనర్చు చుండును. మనస్సును ఆత్మయందు నిలుపుట యనెడి పూజయే సర్వోత్తమమైన దని వేమన అభిప్రాయ పడుచున్నాడు. చిత్తమునందే శివదర్శనము జరుగవలెనని తెలియ జేయుచున్నాడు.

ఉప్పు నీరునట్టు లూహించి చూచినఁ
గప్పురంబు జ్యోతి గలసినట్టు
లుప్పతిల్లు మదిని నొప్పుగా శివుఁడుండు
విశ్వదాభిరామ వినురవేమ !

నీటియందు ఉప్పుకలిసి యున్నట్లు, కర్పూరము జ్యోతి కలిసియున్నట్లు చిత్తమునందు, శివుడు నిలిచి యున్నాడు అని వేమన తెలుపుచున్నాడు. ప్రయత్నము ద్వారా నీటిలోని లవణమును జూడ గలుగునట్లు, ప్రజ్వలింపజేసి కర్పూరమునందు అగ్నిని దర్శింప గలిగినట్లు, ఆంతరంగిక పరిశోధన ద్వారా చిత్తమునందు శివుని దర్శింపవచ్చును అని వేమనార్యుని అభిప్రాయము. చిత్తము చోరునివలె మన శాంతిని అపహ

Dr Dayananda Swamy ebooks

రించుచున్నది. చోరుని శిక్షించునట్లే అంతఃకరణను కూడా శిక్షించవలెననియు దానికి శిక్షణ నొసంగవలె ననియు తెలుపును.

నలుగురు దొంగల బట్టుక
తలద్రుంపక యున్న యట్టి తామసి కేలా
కలుగును జ్ఞానము ధర ని
శ్చల పావన మాత్మసుఖము స త్త్వము వేమా !

మన బ్రతుకులను నగుబాట్లు చేసేందుకు నక్కియున్న నలుగురు చోరులే అంతఃకరణ చతుష్టయము. ఇవియే మనో బుద్ధ్యహంకార చిత్తములు. సంకల్ప వికల్పాత్మకమగు మనస్సు, నిశ్చయాత్మకమగు బుద్ధి, చింతన నొనగూర్చు చిత్తము, "నేను కర్త" ననెడి అహంకారము ఈ నాలుగింటిని ఇచ్చట వేమన దొంగలతో పోల్చుచున్నాడు. దొంగలు మన సంపదను గొనిపోవునట్లు, అంతఃకరణ మనకు ఆత్మానందమును దూరము చేయుచున్నది. అంతఃకరణను అదుపులోకి తెచ్చుకోలేనివాడు తామసియే గాని తపస్వి కాలేడు. తపస్వి కానివానికి జ్ఞానము ఎలా లభించును? అని వేమన సూటిగా ప్రశ్నించుచున్నాడు.

ఉదకమందు పాచి యున్నది చూడరా
మదిని నున్న మాయ మట్టు వడక
సదనమందు బ్రహ్మసాక్షిగా నెంచుము
విశ్వదాభిరామ వినుర వేమ!

పాచి నీటిని కప్పియుండును. పాచిని తొలగించగానే నీరు తెలియును. అలాగే మాయ మనలను ఆవరించి యుండును. మాయను తొలగించ

Dr Dayananda Swamy ebooks

గనే మనస్సు మాయమై, బ్రహ్మము ప్రస్ఫుటముగా తెలియును.నీటిపై పాచి యున్నను నీరు దానిచేత మలినపడదు. అలాగే మాయచేత బ్రహ్మముకూడా మలినపడదు. మాయకు ఆధారమైనదికూడా బ్రహ్మమే. అది దృక్కుయేగాని దృశ్యముకాదు అనెడి అవగాహనను మనస్సునకు అందించాలి.

ఎచటఁ జూచిన నచ్చోట నేమిఁ దోఁచు
నచటి దృశ్యము దృక్కుగా నంటి పట్టి
రచ్చ జేయుట ముక్తికి రాజపథము
సచ్చిదానంద మపు డొప్పుఁజాలు వేమ !

దృశ్యమాన జగత్తు మనకు గోచరించు చున్నది. జగత్తు నందలి రూపము లన్నియు దృశ్యములుగా తెలియుచున్నవి. ఈ దృశ్యము లను గాంచెడి దృక్చైతన్యము ఏమిటి ? అదియే ఆత్మ లేదా చైత న్యము. దృక్స్వరూపమైన చైతన్యమునకు దృశ్యరూపమైన జగత్తునకు సంబంధమేమిటి ? అని ఆలోచించినచో, ఉన్నది దృక్కుయే గాని దృశ్యము ప్రత్యేకముగా లేదని తెలియును. దృగ్దృశ్యములు ఏకమని గ్రహించెడి బుద్ధి విముక్త జ్ఞానమే మోక్షము. ఇదియే సచ్చిదానంద స్వరూపము. చిన్మయానందము.

కనులు రెంటి నడుమఁ గానంత నిలిపిన
బొమల మీఁది జూడ్కిఁ బొందఁజేయు
క్రమ మెఱింగి లోనికాంతిని పట్టుము
విశ్వదాభిరామ వినురవేమ !

Dr Dayananda Swamy ebooks

దృక్చైతన్యము తానని తెలిసి తర్కించవలెనని భావించు సాధకుడు బహిర్ముఖమయ్యే మనస్సును అంతర్ముఖం చేయాలి. చిత్తవృత్తులను నిరోధించాలి. దానికి ధ్యాన మొక్కటియే అనువైన మార్గమని వేమన తెలుపు చున్నాడు. రెండు కనుబొమల నడుమ అనగా భ్రూమధ్యము నందు మనస్సును నిల్పి, సంకల్పములను నిరోధించి, చిత్తమును నిర్విషయ మొనరించగానే అంతర్యంలోని దివ్యశక్తి కాంతిరూపములో ప్రస్ఫుటముగా తెలియును. అట్టి జ్ఞానవెలుగులో చరించి, తరించి, ముక్తిధామమలంకరించాలి అని వేమన తెలియజేయుచున్నాడు.

ధ్యాన సమయమునందు చిత్తము చలించకుండా సాధకుడు జాగ్రత్త వహించాలి. చలించే మనసు అచలమగు ఆత్మను సందర్శించలేదు.

చపల చిత్తవృత్తి జయమొంద గమకించి
నిపుణుఁడయ్యు యోగనియతి మీఁటి
తపము చేయువాడు తత్త్వాధికుండురా
విశ్వదాభిరామ వినురవేమ !

మనస్సు సదా చలించు చుండును. అస్థిరమై, చంచలమైన చిత్తమును నిగ్రహించుకొనుటకు యమ నియమాది అష్టాంగ యోగమును అభ్యసించవలెను. అష్టాంగ యోగసాధన ద్వారా మది కుదుట పడగానే బాహ్య ప్రపంచము యొక్క ప్రభావము సన్నగిల్లును. ఇలా స్థిమిత పడిన అంతఃకరణను తపస్సు ద్వారా ఆత్మవైపునకు మఱలించవలెను. ఇలా ఎవరైతే తరించుదురో వారే ఉత్తమ యోగులని వేమన అభిప్రాయ పడుచున్నాడు. యోగము ద్వారా పక్షిని వలలో బంధించు నట్లు మనస్సును బంధించవచ్చును అని వేమన తెలుపుచున్నాడు.

Dr Dayananda Swamy ebooks

చిక్కి దక్కఁబోదు చిగిరించు మదిలోన
నిక్కు బట్టి గుఱుతు నెఱయఁజూచి
సొక్కియున్న ఘనులు సూత్రాత్మ లగుదురు
విశ్వదాభిరామ వినుర వేమ !

పక్షి చిక్కినట్లే చిక్కి చేజారి పోవునట్లు, మనస్సు నిలిచినట్లే నిలిచి జారి పోవు చుండును. ధ్యానము సాగించునపుడు మనస్సు నిగ్రహించబడి నట్లే తెలియును. అలా భావించుచుండగానే బహిర్ముఖమై చేజారిపోవును. కనుక తదేక ధ్యానముతో మనస్సులో నడిచే సంకల్పాలను వీక్షిస్తూ ఉండాలి. మంత్రబీజము మనోక్షేత్రములో వృథా గాకుండా నిత్య నూతన శాంతి పల్లవములతో చిగురించునట్లు చూసుకొంటూ సాధకుడు చరించాలి. శాంతి స్థానమును చక్కగా నెరిగి అందు ఒదిగి పోవువారే తత్త్వజ్ఞులని వేమన తెలుపుచున్నాడు. వీరే సత్యద్రష్టలు.

సత్యమనఁగ వేఱె జగమునఁ గనలేదు
నిత్యమగుచు నాత్మ నెగడియుండు
నిత్యవస్తు వెఱుఁగ నీవెపో బ్రహ్మంబు
విశ్వదాభిరామ వినుర వేమ !

సత్యమనునది ఎక్కడో ఉండునదికాదు. అవలోకించినచో అంతర్యము నందే నిత్యమై భాసించుచున్నది. అట్టి నిత్య వస్తువును దర్శించ గనే అది నీవే యనెడి సత్యము అర్థమగును. బ్రహ్మము నీవే యని తెలియును. ఇదియే సత్యదర్శనము. నిత్యస్వరూపము.

Dr Dayananda Swamy ebooks

వ్యాధి వచ్చినపుడు వైద్యునిచే మందు
దీసి తినక కాని తీఱదెందు
మందు వంటి మనసు మనుజుండు కనవలె
విశ్వదాభిరామ వినురవేమ!

ప్రారబ్ధ కర్మము ననుభవించుట కొరకు పుట్టిన దేహమునకు ప్రారబ్ధ జన్యమైన కర్మఫలములు అందక పోవు. రోగములు కలుగక మానవు. దేహమునకు రోగము వచ్చినపుడు వైద్యుని సమీపించి మందు పుచ్చుకొందుము. మందు రోగమును ఉపశమింప జేసి ఆరోగ్యము నొనగూర్చును. అలాగే అశాంతి జీవనములో అల్లాడు మనిషికి శాంతి నొనగూర్చు మందులాంటి మనస్సు ఉండవలెను. దేహారోగ్యము మందుపై ఆధారపడి యున్నట్లు, వ్యక్తి ఆనందము మనస్సుపై ఆధారపడి యున్నది.

చిత్రదీపమువలె చింతను దిగఁద్రొక్కి
మిత్రముగను మనసు మెలఁకు వెఱఁగి
శత్రు గుణము లెల్ల సాధించుటయే ముక్తి
విశ్వదాభిరామ వినురవేమ!

రంగస్థలముపై నాటకము జరుగుచుండును. వేదికపై వెలుగుచున్న దీపము నాటకమును ప్రకాశింపజేయుచుండును. రంగస్థలముపై ప్రదర్శింపబడు నాటకములోని హాస్య, శోక సంఘటనలకు దీపమునకు సంబంధములేదు. దీపము రంగస్థలమును ప్రదీప్తం చేయునే గానీ నాటకముతో తాదాత్మ్యం చెందదు. అలాగే మనస్సనెడి రంగస్థలిపై

Dr Dayananda Swamy ebooks

చిత్ర విచిత్రమైన నాటకములు సాగిపోవుచుండును. చిత్ర దీపమువలె ఆత్మ మనస్సనెడి రంగస్థలమును ప్రకాశింపజేయుచుండును. మనో వికారములు ఆత్మకు సంబంధించినవి కావు. ఈ అవగాహనతో అవేదనను అంతరింప జేసుకోవాలి. అప్పుడు చిత్తము వెలికాడై నిలుచును. నేస్తమైన చిత్తము అభిమాన అహంకారాది శత్రువులను ఛేదించుటకు సహకరించును. అలా శత్రుసంహారము జరిగిన పిదప ముక్తి సింహాసనము నధిష్ఠించవలెను అని వేమన పలుకుచున్నాడు.

మనసునందు ముక్తి మలయుచు నుండఁగ
మనసు నెఱుఁగలేని మనజులెల్ల
మనసు నంటలేక మాయమై పోయిరి
విశ్వదాభిరామ వినుర వేమ !

ముక్తి వెదికినచో మనస్సులోనే లభ్యమగును. అట్టి మనస్సును తెలిసికొనలేక నిగ్రహించలేక పోయినవారు, మనస్సు యొక్క నిజస్థితిని తెలియలేనివారై నశించిపోయిరి అని వేమన పలుకుచున్నాడు. మనస్సును నిగ్రహించినవాడే భగవదనుగ్రహమునకు పాత్రుడగును. మనస్సును జయించినవాడే జగత్తును జయించిన వాడగును.

వస్తు ప్రపంచముతో తాదాత్మ్యము చెంది, కల్మషమైన మనస్సు త్రాటితో బంధించబడిన పశువువలె ప్రపంచముతో ముడిపడియున్నది. రజోగుణముతో నిండిన మనస్సు బంధమును కలిగించుచున్నది. రజస్తమోగుణముల నుండి విడిపడి సత్వగుణముతో నిండిన మనస్సు ముక్తికి కారణమగుచున్నది. మనస్సు సంస్కరించబడగానే బ్రతుకు శాంతిమయ మగును.

Dr Dayananda Swamy ebooks

శుష్క పాండిత్యము

శుష్క పాండిత్యముతో, శూన్య హృదయులై మాయమాటలను పలికే మోసపు గురువులను, మిథ్యాచార్యులను వేమన యోగి తీవ్రంగా విమర్శించాడు. సద్గురువులైన వారు ప్రశాంత నడకను సాగించుచుండ, డాంబిక జీవనముతో విఱ్ఱవీగుచున్న కపట గురువులను వేమనార్యుడు నిశితముగా నిరసించాడు.

గంగ పారుచుండు కదలని గతితోడ
ముఱికికాల్వ పారు మ్రోత తోడ
అధికు డోర్చునట్లు లధము డోర్వగలేడు
విశ్వదాభిరామ వినురవేమ !

విశేష జలమును ఔదల దాల్చి ప్రవహించు జాహ్నవి ప్రశాంతముగా గంభీర నిస్వనముతో కదిలిపోవుచుండును. నికృష్టమైన మురికికాలువ కొద్దిపాటి నీచజలమును కలిగి పారుచూ మేఘ గర్జనమువలె శబ్దము చేయుచుండును. అధికునకు ఆడంబరము తెలిసిరాదు. అల్పునకు చల్లదనమూ అర్థంకాదు. నిండుకుండ శబ్దము చేయదు. జ్ఞానియైన గురుదేవుడు సామాన్యముగా కన్పించును హృదయగ్రంథులు వీడని పండితులు లేని శోభను ఊహించుకొనుచు, కనుబొమలు చిట్లించి, మెడను ప్రక్కకు త్రిప్పి, మూతి బిగించుకొని, గూటములేని అక్షరాలకు బిసవుగా గూటములను తగిలించి, నాభినుండి శబ్దమును కదిలించి, వెఱ్ఱిచూపులతో, వింత సోయగములతో శ్రోతలను రంజింపజేయ యత్నింతురు. విఫల మనోరథులై చింతించుచుందురు. భగవత్స్వరూపులైన సద్గురువులు శ్రోత్రియులై, బ్రహ్మనిష్ఠులై, తమను సమీపించువారల

Dr Dayananda Swamy ebooks

హృదయముల యందలి సమస్యలను కారుణ్యముతో అవగతము చేసుకొని, గలగలమని పారు సెలయేరువలె, చల్లని మారుతమువలె సత్యవచనములను పలుకుచూ, తమ జ్ఞాన కిరణ ప్రసారము వలన అజ్ఞాన చీకట్లను అంతమొందించుదురు. శుష్కపాండిత్యములు మన లను ఉద్ధరించవు. శుద్ధమైన జ్ఞానమే మనలను ముక్త పురుషులుగా తీర్చి దిద్దును

మాట లాడవచ్చు మనసు నిల్పగలేడు
తెలుపవచ్చు తన్ను దెలియలేడు
సురియ బట్టవచ్చు శూరుండు గాలేడు
విశ్వదాభిరామ వినురవేమ !

శాస్త్రములోని విషయాలను చిలుకవలె వల్లించవచ్చు. వాటిని ఇతరులకు వినిపించవచ్చు. స్వానుభవములేక, స్వరూపానుభూతిలేక చేసెడి బోధవలన ఏమి ప్రయోజనము? నిలువలేనివాడు నిచ్చెన నెక్కునా ? కత్తిని చేత ధరించడము వేఱు, యుద్ధము చేయుట వేఱు అని వేమన చక్కగా విమర్శించుచున్నాడు. కత్తి పట్టినవాడు శూరుడు గానట్లు, గ్రంథములు మోయువాడు వానిలోని సుగంధమును ఆఘ్రాణించినాడని చెప్పలేము అంటున్నాడు వేమన యోగి. ఈ విధముగా కత్తిపట్టిన ఉత్తర కుమారులతోనే ఎక్కువ శాతము దేశము నిండియున్నది. సనాతన ధర్మజీవనము అడుగంటి పోవడానికి ఈ వక్తలే ముఖ్యకారణముగా తెలియుచున్నారు.

ఇటీవల ఒకచోట నా పర్యటనలో ఒక భక్తుడు కలిసాడు. “ స్వామీజీ ! మా గురువుగారు చాలా గొప్పవారు. విద్వాంసులు. జ్యోతిషము తెలుసు. వేదాంతము తెలుసు. సర్వశాస్త్రములు తెలుసు.

Dr Dayananda Swamy ebooks

పెద్ద పెద్ద డిగ్రీలు ఉన్నాయి. నిజం చెప్పాలంటే వారు నారాయణుడే. ఈ రహస్యం చాలా తక్కువ మందికి తెలుసు" అన్నాడు.

నిజమే కావచ్చు. ఏపుట్టలో ఏముందో నాకేమి తెలుస్తుంది? సంతసించాను. "బాబూ! మీ గురువుగారి ద్వారా నీవేమి నేర్చినావు. వారు మీకు ఏమేమి తెలిపినారు?" అని అడిగాను. "స్వామీజీ! ఎవ్వరూ చెప్పలేని విషయం వారు చెప్పినారు. ఇటీవల వారు మా ఇంటికి వచ్చినారు. ఇల్లంతా పరిశీలించారు. వంటింటిని చూశారు. వెంటనే ఆ ఇల్లును పడగొట్టమన్నారు." అన్నాడు. నేను అప్రయత్నంగా అదేమిటి? ఇల్లును పడగొట్టడమెందుకు?" అన్నాను.

"నేను గిట్టకుండా ఉండేందుకు!" అని ఆ భక్తుడు గంభీరముగా పలికాడు. "స్వామీజీ! మా గురువుగారు ఏ ఇంటికి వెళ్ళినా ఆ ఇంటిని బాగా పరిశీలించి చూస్తారు. అందులోని లోపాన్ని గుర్తిస్తారు. దానిని పడగొట్టిస్తారు. మా గురువుగారి శిష్యుల ఇళ్ళన్నీ మొత్తం మీద ఇలా మరమ్మత్తు జరుగుతూనే ఉంటాయి. వారు మా ఇల్లు కూల్చకపోతే, నేను కూలిపోయి ఉండేవాడిని" అన్నాడు.

నేనేమీ మాట్లాడలేదు. "స్వామీజీ! మీరూ ఇలాంటివి చెబుతారా?" అని వెంటనే నేను ఊపిరి పీల్చుకొనే అవకాశం కూడా ఇవ్వకుండా అడిగాడు. "కొంపలు కూల్చే విద్య నాకు రాదు" అని మారు మాటను ఎదురు చూడకుండా వచ్చేశాను. కారెక్కాను. అతడు నాకు చూపిన పూతరేకు లంతటి నామాలు గల అతని గురువుగారి ఫోటో నాకళ్ళముందు కదలాడుచునే యున్నది. ఇంతలో గోచి పెట్టుకొన్న పిచ్చి వేమన కన్పించాడు. రెండు క్షణాలు ఆలోచించాను. వేమనార్యుడు పలికిన వేదనిజం స్మృతికి వచ్చింది.

Dr Dayananda Swamy ebooks

పట్టుబట్ట గట్టి, పట్టెనామము బెట్టి
వట్టి భ్రాంతి జెంది వైష్ణవుడయి
పొట్టి దాగినతడు లోకుల జెరచురా
విశ్వదాభిరామ వినురవేమ !

ఆహా! నిత్యుడైన వేమన యోగి సత్య పలుకులు కాలమార్పులకు చెదరక ఎంత చక్కగా భాసించుచున్నవి? నాలో నేను ఆలోచించుకో సాగాను.

సంస్కారవంతుని సమదర్శన యోగిగా చేసేందుకు సద్గ్రంథాలు ఉపయోగపడుతాయి. అంతేగాని కేవలం పుస్తకములు చదివినంత మాత్రాన వ్యక్తి జ్ఞాని కాలేడు. గ్రంథులు వీడుటకు గ్రంథములే సరిపోవు. ఈ విషయమును వేమన చక్కగా తెలియ పరుస్తాడు.

శింగణాలు బలిసి నింగికి నెగిరిన
చెట్టు చివర పండు చేతబడునె
పుస్తకములు చదువ బొందునా మోక్షంబు
విశ్వదాభిరామ వినురవేమ !

పొట్టి మానవుడు ఎంత ఎగిరినను చెట్టు చివరనున్న పండును అందుకోలేడు. అలాగే పుస్తక పాండిత్యమునకు పరిమితమైన వాడు ముక్తిని పొందలేడు.

Dr Dayananda Swamy ebooks

మూఢాచారములు

మూఢ విశ్వాసములు, మౌఢ్య ఆచారములు వ్యక్తియొక్క ఆధ్యాత్మికాభివృద్ధిని ఆటంక పరచునని భావించి వాటిని వేమన తీవ్రముగా విమర్శించి, నిరసించాడు. తాత్త్విక జీవనము హేతుబద్ధమైనది. అజ్ఞానయుతమైన మూఢాచారములకు నిలయమైనవాడు విజ్ఞాన వీధులలో విహరించి ముక్తి సదనమును చేరుట దుర్లభము.

జనులు సాధారణముగా మ్రొక్కుబడులకు, తీర్థక్షేత్ర సందర్శనమునకు అలవాటు పడియుందురు. మహాత్ములు చరించిన పుణ్యతీర్థములయందు మునకలేసి మహాత్ముల బోధలను మననము చేసుకొని ఆచరించి, తరించుటకు, ఏర్పడిన తీర్థక్షేత్ర సందర్శనము వలన వ్యక్తి నిర్మలుడగును. అలాగే తన వద్దనున్న సంపద అంతయు భగవంతుని కృపావిశేషమేయని భావించి, ఆ సంపదలో కొంత భాగమును ముడుపుల రూపమున భగవత్కైంకర్యమునకు వినియోగించుట కూడా విశిష్ట ఆరాధనయే కాగలదు. ఇవి అన్నియు అంతఃకరణ శుద్ధి నొనరించి జీవుని పవిత్రునిగా చేయును. నిర్మల జీవనమును పొందుటకు నిర్దేశింపబడిన ఈ ఆచారములు అవగాహనతో ఆచరించబడాలి. కల్మషములను అంతర్యములో నింపుకొని, బాహ్యానికి సదాచార జీవనము కనుబరచు వైఖరి గర్హణీయమని వేమన అభిప్రాయపడుచున్నాడు. ఆధ్యాత్మిక సాధకుడు కుటిలుడు కాకూడదు. మిథ్యాచారుడు కాకూడదు. కపటికి కైవల్యము సిద్ధించదు.

Dr Dayananda Swamy ebooks

నీళ్ళ మునగనేల నిధులు మెట్టగనేల
మొనసి వేల్పులకును మ్రొక్కనేల
కపట కల్మషములు కడుపులో నుండగా
విశ్వదాభిరామ వినురవేమ !

కల్మషము లను కడుపులో నుంచుకొని తీర్థక్షేత్ర సందర్శనము గావించినను, దానధర్మము లాచరించినను, మ్రొక్కుబడులు తీర్చుకున్నను ముక్తి లభించదని వేమన అభిప్రాయపడినాడు. అలాగే నీవు నిష్కపటివిగా నుండి సత్యజీవనమును సాగించునపుడు నీకు ఎవ్వరు హాని చేయలేరు, ఈ సత్యమును గ్రహించలేని జనులు శకున శాస్త్రములను, మూఢ సంప్రదాయములను నమ్మి చెడిపోవు చుందురు.

గూబచేర గృహము గునిసి పాడుగబెట్టి
వెళ్ళిపోదు రెంత వెఱ్ఱివారొ
గూబగృహము లేమి కూర్చురా కర్మంబు
విశ్వదాభిరామ వినురవేమ !

గృహములో గుడ్లగూబ చేరిందని తెలిసి, దానిని కీడుగా భావించి, గృహమును మూతవేసి మరొకచోట జనులు మకాంపెట్టి బాధపడు చుందురు. హృదయ నైర్మల్యము గలవాని శోభను గూటిలోని గూబ పాడుచేయునా? ఇది కేవలం మూఢాచారము అని వేమన తెలుపు చున్నాడు.

కులమతాలను వేమన విమర్శించాడు. కులము పేరిట అనుకూల జీవనమును చావుదెబ్బ గొట్టే దుర్వ్యవస్థను వేమన చీల్చి చెండాడాడు. మానవు లందరూ ఒకే కులమని తెలిపినాడు. సత్యదర్శనము చేసిన

Dr Dayananda Swamy ebooks

వానికి వివిధ సుమములు ఒకే మాలలో తెలియునట్లు, వివిధ కులములు ఒకే ఆత్మలో లయించి పోతాయి.

కట్టెపేరు లోడగట్టి చెప్పగరాదు
కానరాదు లోని కలిమితనము
జంగమైన పిదప జాతి నెంచగరాదు
విశ్వదాభిరామ వినురవేమ !

కట్టెలతో పడవను నిర్మింతురు. పడవలో అనేక జాతుల కట్టెలు కలిసి యుండును. ఓడ తయారైన పిదప అందులో ఉన్నదంతా కట్టెయే. అంతేగాని అందులో ఇది బండారు కొయ్య, ఇది వేగేశకొయ్య, ఇది వేపకొయ్య అని వేఱువేయుటకు వీలుపడదు. అలాగే శివభక్తుడైన వానికి సర్వము శివమయమే యగుచున్నది. అట్టివానికి కులాలు ఎలా తెలియగలవు ? అని వేమన సూటిగా ప్రశ్నించుచున్నాడు.

శకునములకు జనము జడిసిపోవు చుందురు. శకుని మాయలకు భయపడవలెను గాని శకున గతులకు కాదు. ప్రయాణమయ్యే సమయాన కట్టె ఎదురయ్యాయని, పిల్లి అడ్డు నిలిచిందని, తైలవర్తకుడు తిలకించాడని, బ్రహ్మచారి బదులు పలికాడని భావించి చాలామంది ప్రయాణములను ఆపుకొను చుందురు. ఈ శకున శాస్త్రమును నిస్సారమైన శాస్త్రముగాను, నిషేధించదగినది గాను వేమన అభిప్రాయపడుతాడు.

పాలపిట్ట శకున ఫలమిచ్చునందురు
పాలపిట్టకేమి ఫలము దెలియు ?
తనదు మేలు కీడ్పు తన తోడ నుండగ
విశ్వదాభిరామ వినురవేమ !

Dr Dayananda Swamy ebooks

పక్షులకు, కొయ్యలకు కర్మఫలము నిచ్చే శక్తి కలదా? అని వేమన ప్రశ్నించుచున్నాడు. ఎవరి కర్మకు వారే బాధ్యులు అని తెలియజేయుచున్నాడు. కర్మఫల ప్రదాత సర్వజ్ఞుడైన భగవానుడేగాని అన్యులు కాలేరు అని పలుకుచున్నాడు. తన ప్రారబ్ధము ననుభవించుటకు జన్మ నెత్తిన పాలపిట్టలు, నల్లబల్లులు నీ గమ్యము నెలా నిర్ణయించగలవు? అని అడుగుచున్నాడు. ఇదంతా మతిచెడిన మనస్సులలో నిండిన మౌఢ్యము అని వేమన కొట్టివేయుచున్నాడు. అట్టి మూఢాచారములను మోసుకొని తిరిగే అర్భకుల మాటలకు విలువ లేదని తెలుపుచున్నాడు.

బల్లి పలుకులు విని ప్రజలెల్ల తమ పనుల్
సఫలములగు నంచు సంతసించి
కాని పనులకు తమ కర్మమటందురు
విశ్వదాభిరామ వినురవేమ !

శకునములను విశ్వసించి చరించు వ్యక్తుల అవగాహన అస్తవ్యస్త ముగా నుండునని వేమన తెలుపుచున్నాడు. అనుకూలించిన వాటిని శకునములకు అంటగట్టి, ప్రతికూలించిన వానిని తమ కర్మఫలితము లుగా భావించి సరిపెట్టు కొనుచుందురని విమర్శించుచున్నాడు. ఇలాంటి మూర్ఖులు మోక్షమునకు అనర్హులని హెచ్చరించు చున్నాడు.

కుక్క యేమెరుంగు గురులింగ దేవుని
నక్క యేమెరుంగు నొక్కప్రొద్దు
మూర్ఖు డేమెరుంగు మోక్షంబు త్రోవను
విశ్వదాభిరామ వినురవేమ!

అని మూఢాచారములను వేమన నిశితముగా ఖండించాడు. జ్ఞానమార్గ మునే ప్రోత్సహించాడు.

Dr Dayananda Swamy ebooks

అరిషడ్వర్గములు

ఆత్మానుభూతి నొందగోరు ముముక్షువులు అరిషడ్వర్గములను జయించియే తీరవలెను. కాముని గెలువనివాడు రాముని పట్టలేడు. క్రోధమును చంపలేనివాడు సమాధి నొందలేడు. లోభము గలవానికి ఆత్మలాభము చేకూరదు. మోహముగల వ్యక్తి మాయచే మోసపడును. మదము చేరిన వానికి ముదములేదు. మాత్సర్యము అంతరించినపుడే ప్రభువుకు మనపై వాత్సల్యము కలుగును. కనుక అరిషడ్వర్గములు అరిష్టములని భావించమంటున్నాడు వేమనయోగి.

ఆర్గురు దొంగల బట్టుక
మార్గముననె కొట్టి యొకని మన్నింపఁ దగుఁం
దుర్గమ మిది తెలియంగా
నిర్గుణ రూపంబు తెలియు నిజముగ వేమా !

ఆర్గురు దొంగలు ఆత్మాన్వేషివైన నిన్ను అడ్డగించుదురు. వారిని నీవు సంహరించినపుడే నీ మార్గము సుగమమగును. వారే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములు. ఈ ఆర్గురిలో ఒకరిని మాత్రము వధించక విడిచిపెట్టమని వేమన తెలియజేయుచున్నాడు. ఆ దొంగయే మొదటిదైన కామము. కామాది ఆర్గురు దొంగలలో కామమును వధించకూడదు. దానిని భగవత్సాక్షాత్కారము కొరకు వినియోగించినపుడే మోక్షము మనకు లభించును. కామి గానివాడు మోక్షకామి గాలేడని తానే మరియొకచోట చెప్పియున్నాడు కూడాను. కనుక కోరిక మాత్రము ఉండాలి. అయితే అది ముక్తికాంత కొరకై ఉండాలి

Dr Dayananda Swamy ebooks

అంటున్నాడు వేమనయోగి. అనిత్య విషయాలపై నడిచే కామము బంధమును కల్గించునని తెలియజేయుచున్నాడు.

కామము :-

కామము అతి భయంకరమైనది. ఇది ఇంద్రియ మనోబుద్ధు లను బహిర్గత మొనర్చును. శాంతిని భగ్నము చేయును. విశ్రాంతిని బ్రతుకులో అదృశ్య మొనర్చును.

కామచింతఁ జిక్కి కనుగాన నేరవు
నీమనిష్ఠఁ దగిలి నియతి మీఱి
తామసంబు నడఁచి తన్మయమందరా
విశ్వదాభిరామ వినుర వేమ!

కామప్రేరిత వాసనలచేత వ్యక్తి కన్నుమిన్ను తెలియక ప్రవర్తించు నని వేమనార్యుడు అభిప్రాయపడుచున్నాడు. నియమ నిష్ఠలను కలిగి, సదాచారవంతుడై జీవించమని తెలుపుచున్నాడు. తమోగుణమును అంతరింపజేయనిదే బ్రతుకులోని తమస్సు దూరంకాదు. తమస్సు తొల గనిదే జ్ఞాన ఉషస్సు గోచరించదు. అందుచేత తమోగుణమును కల్పించెడి కామము వ్యక్తి ఆధ్యాత్మిక అభివృద్ధికి ఆటంకమై ఉన్నదని వేమన పలుకుచున్నాడు. అవగాహనద్వారా కామాగ్నిని చల్లబరచాలి.

క్రోధము :-

క్రోధమును ప్రాణహరి అనికూడా పిలుతురు. "క్రోధః ప్రాణ హరః" అని శ్రీ మద్రామాయణము బాలకాండయందున్నది. ప్రాణమును హరించు క్రోధము అతి భయంకరమైనది. మిత్రులను శత్రువులుగా మార్చును. వ్యక్తిలోని జ్ఞానమును క్షణములో అపహరించి బ్రతుకును అంధకార బంధు

Dr Dayananda Swamy ebooks

రముగా మార్చును. ఈ క్రోధము విషయములో ఆధ్యాత్మిక సాధకులు జాగరూకులై ఉండవలెనని వేమన అభిప్రాయము.

కోపమునను నరకకూపముఁ జెందును
కోపమునను గుణము కొఱతవడును
కోపమునను బ్రతుకు కొంచెమైపోవును
విశ్వదాభిరామ వినురవేమ !

క్రోధము మానవుని నరకానికి తరలించునని వేమన తెలుపుచున్నాడు. యదార్ధానికి క్రోధజీవనమే నరకతుల్యమై గోచరించును. క్రోధము కదిలిన సమయాన వ్యక్తి బుద్ధి దారి తప్పును. నిశ్చయాత్మకమైన బుద్ధి వక్రించుటవలన వ్యక్తిలోని సద్గుణము లన్నియు అంతరించును. కోప జీవనము బ్రతుకును కొంచెముగా మార్చునని వేమన తెలుపుచున్నాడు. ఇలా నీచమార్గములగుండా మనలను నడిపే క్రోధము ప్రమాదకర మని భావించి క్రోధమును దూరం చేసుకొని వ్యక్తి తరించాలి. ప్రేమ యనెడి సుగుణము క్రోధమనెడి దుర్గుణమును అంతమొందించును.

లోభము :-

లోభమనునది జీవన శోభను అంతరింపజేయును. లోభి పదు గురిలో చులకనగా బ్రతుకును. జన్మసార్థకతను విస్మరించును. చేయరాని పనులను చేయును. సత్యమునకు దూరుడై జీవించును. అసత్యమునకు వారసుడుగా బ్రతుకును. అనుమానములతో బ్రతుకును సాగించును. ధర్మచ్యుతు డగును. సంఘజీవనమున దెబ్బ కొట్టును. లోభ జీవనము ఎప్పుడూ లాభమును చేకూర్చదు అంటున్నారు శ్రీ. వేమన.

Dr Dayananda Swamy ebooks

లోభివాని జంప లోకంబు లోపల
మందు వేఱువలదు మతమె గలదు
పైక మడుగ నతఁడు భగ్గురుమని చచ్చు
విశ్వదాభిరామ వినురవేమ !

లోభియొక్క నికృష్ట అంతర్యమును వేమన ఇచ్చట తెలియజేయు చున్నాడు. లోభివానిని చంపుటకు విషపుమందులు అవసరము లేదని చెబుతున్నాడు. లోభిని వధించుటకు చక్కని ఉపాయము కలదని తెలుపుచున్నాడు. లోభివానిని ధనమడిగిన చాలును. ఇవ్వ నిచ్చగించక తనంతట తానే చచ్చునని వేమన చమత్కరించుచున్నాడు. లోభిని కృపణుడని ఉపనిషత్తు పల్కినది. లోభమును త్యాగము ద్వారానే జయించాలి. లోభము జీవత్వమును అందించినది. త్యాగము అమృతత్వమును ప్రసాదిస్తుంది.

మోహము :-

మోహ మహార్ణవమున మునిగినవాడు బయట పడుట బహు కష్టము. సత్యమును అసత్యముగాను, అసత్యమును సత్యముగాను భావించెడి బుద్ధియే మోహనిలయమై ఉన్నది. మోహమునకు గురియైనవాడు సత్యదర్శనము చేయలేడు అని వేమనయోగి తెలుపుచున్నాడు.

మోహజలధిలోన మునిఁగి చచ్చుటేకాని
హరి పరాయణత్వ మమరఁబోదు
ముట్టి గురుని పాదమూలము నొందుము
విశ్వదాభిరామ వినురవేమ !

Dr Dayananda Swamy ebooks

మానవుడు జీవించినంత కాలము మోహమున పడి అలమటించునే గాని హరిభక్తి వైపు మనసును మరలించడు. అసత్య జీవనము మానవుని సత్యజీవనము వైపు నడిపించదు. ఈ మోహవలయము నుండి విడి పడి తరించవలె నన్నచో సద్గురువు పాదములను ఆశ్రయించుటయే ఏకైక మార్గమని వేమన తెలుపు చున్నాడు. గురుబోధ మహిమాన్విత మైనది. అది మోహమును నివారించును. జ్ఞానమును అందించును. సూర్యుని ఆగమనముతో అంధకారము అదృశ్య మగునట్లు, జ్ఞానోదయము కాగానే మోహము అంతరించును. బోధద్వారా మోహమును నివారించుకోవలెను.

మదము :-

ఆధ్యాత్మిక ప్రగతిని నిరోధించు శత్రువులలో మదము ఐదవదియై ఉన్నది. మదము గలవానియందు దమము గోచరించదు. ఇంద్రియ లోలత్వమేగాని మదము గలవానికి ఇంద్రియ నిగ్రహము తెలిసిరాదు. మదము గలవానికి ముదము కలుగదు.

మదముచేత లోక మాయలు దెలియరు
మదముచేతఁ దన్ను మఱచు నెపుడు
బుద్ధిలేని పసుల పోలికఁ జెడుదురు
విశ్వదాభిరామ వినురవేమ !

మదము గలిగినవారు వివేకభ్రష్టులుగా నుందురు. అట్టివారు మాయను కనుగొనలేక మాయలో పడి మాయమగుచుందురు. మాయకు లొంగిన వాడు మహాత్ముడు కాలేడు. అందుచేత బుద్ధి ఉండియు పశువులవలె మరణించుట జరుగుచున్నది అని వేమన పలుకుచున్నాడు.

Dr Dayananda Swamy ebooks

మాత్సర్యము:-

మత్సరగ్రస్తుడైన వానికి శాంతిలేదు. మాత్సర్యము గల వాడు సదా తన సుఖమును గూర్చియే ఆలోచించుకొను చుండును. అంతియే గాదు. ఇతరులు సుఖించుటను క్షణ మైనను ఓర్వలేడు. మాత్సర్యమనునది అతి నీచమైన దుర్గు ణము. ఇది అసురీ సంపదకు సంబంధించినది. మాత్సర్యము చేతనే రాక్షసులందరు పురాణకాలమందు హతులైనారు.

మత్సరంబు మదము మమకార మనియెడి
వ్యసనములను దగిలి మసలఁ బోక
పరుల కుపకరించి పరముఁడ వగు పొమ్మ
విశ్వదాభిరామ వినురవేమ!

మదము, మాత్సర్యము, మమకారము అనెడి మకార త్రయమునకు లొంగినవాడు వ్యసనపూరితుడై నశించును. అలాగాక పదుగిరికి ఆద ర్శమగు రీతిలో జీవించి పరమాత్మవై వెల్గొందమని వేమన తెలుపు చున్నాడు. అరిషడ్వర్గములు అంతరించని వానికి ఆత్మానందము లభ్యము కాదు.

అరిషడ్వర్గములు అజ్ఞానము యొక్క వ్యక్త స్వరూపములు. మేఘములు సూర్యుని కప్పివేయునట్లు, అజ్ఞానము జ్ఞాన భాస్కరుని మూసివేయును. అరిషడ్వర్గములు అంతరించగనే అజ్ఞానము అదృశ్య మగును. జ్ఞానము స్వప్రకాశమై గోచరించును ఇదియే జీవ బ్రహ్మైక్యము.

Dr Dayananda Swamy ebooks

జీవబ్రహ్మైక్యము

అవిద్యోపాధి గలవాడు జీవు డనబడుచున్నాడు. ఉపాధి వినిర్ముక్తుడైన జీవుడు దేవుడే యగుచున్నాడు. ఈ సత్యమును గ్రహింపలేని మూర్ఖులు జీవుడు బ్రహ్మము కన్నా వేఱని భావించుచుందురు. అట్టివారు అద్వైతమును అంగీకరించరు. వేమన అద్వైతి. ఈ విషయములో సందేహము అవసరము లేదు. అందుచేతనే తన బోధయందు సదా అద్వైతమునే వేమన ప్రతిపాదించును.

జీవుని దెలియక వేఱుగ
దేవుని భ్రమదిరుగు నరుఁడు దేవుఁడు తలఁపన్
జీవుండని వివరించిన
భావింపఁగ ముక్తి బట్టబయలగు వేమా !

జీవుడు దేవునికన్నా వేరని భావించి మానవుడు దేవునికై అన్వేషించుచుండును. తాను అన్వేషించు దేవుడు యదార్థానికి జీవునికన్నా అన్యము గాదని గ్రహించుటయే ముక్తియని వేమనయోగి తెలుపుచున్నాడు. అట్టి ముక్తిని పొందినవాడు తిరిగి బంధములో చిక్కుకోడు అని వేమన పలుకుచూ,

"నావ నడుపువాడు వట్టేట మునుగునా ?"

అని తెలియజేసినాడు. ఛాందోగ్యోపనిషత్తు ప్రతిపాదించిన "తత్త్వమసి" మహావాక్యమునే వేమనయోగి కూడా స్థిరపరచును.

Dr Dayananda Swamy ebooks

తత్పదము నెన్న ప్రత్యగాత్మమ్ము సుమ్ము
త్వం పదం బన బ్రహ్మ రూపమ్ము కదర
అసి పదమ్మున లక్ష్యమ్ము నైక్యము గన
సోఽహ మర్థంబుఁ దెలియంగఁ జూడు వేమ !

"తత్త్వమసి" అనెడి మహావాక్యమునందు "తత్" పదము ప్రత్యగాత్మను సూచించు చున్నదనియు, "త్వం" పదము పరమాత్మను తెలుపు చున్నదనియు, "అసి" పదము జీవబ్రహ్మైక్యమును తెలుపు చున్నదనియు పలుకును. ఈ అవగాహన కుదిరినచో "అహం బ్రహ్మాస్మి" అనెడి జ్ఞానము అనుభవమునకు అందును.

అంతఃకరణ శుద్ధిలేనిదే అద్వైతజ్ఞానము అనుభవమునకు అందదు అని వేమన అభిప్రాయము.

" చిత్తశుద్ధిలేని శివపూజ లేలరా "

అని వేమన ఒక చోట ప్రస్తావించును. కనుక శివపూజ చిత్తశుద్ధితో జరుగవలెనని వేమన అభిప్రాయము.

పూజసేయఁ జేయఁ బూజారి తానౌను
పూజ్యవస్తు వెన్న భువిని దానె
ఏడఁ బూజసేయ నెల్లదిక్కులు తానె
తాను నేను నేను దానె వేమ !

పూజ చేయుచుండినచో వ్యక్తి భక్తుడగును. అయితే అట్టి పూజ్యవస్తువు తానేయని భావించగలిగినచో జ్ఞాని యగును. పూజ్యవస్తువు పరమాత్మయే గనుక, పరమాత్మ సర్వవ్యాపకుడైనందున అట్టి సర్వగతాత్మను గూర్చి ఎలా పూజ చేయుగలుగును? అట్టి స్థితిలో "త్వమేవాహం" అతడే నేను అనెడి అద్వైతజ్ఞానమే స్థిరముగా నిలుచును అని వేమన పలుకుచున్నాడు.

Dr Dayananda Swamy ebooks

ఏది యేదని మదిలోన పాదు దెలిసి
కాదు కాదని పరికించి కనులు దెఱచి
ఆదిమూలము గనుచుండు నాత్మవేత్త
దానసే పరమానంద మౌను వేమ !

"తానే బ్రహ్మము" అనెడి భావములో నిలుచుటకుగాను అనువైన క్రమమును వేమనార్యుడు పైపద్యమునందు తెలిపినాడు. నిరంతరము బ్రహ్మమును మదియందు అన్వేషించమని తెలుపుచున్నాడు. "కోహం ?" నే నెవరు అనెడి విచారమును సాగించమని పలుకుచున్నాడు. తనను తెలియు మార్గములో తెలియవచ్చెడి దేహేంద్రియ మనోబుద్ధులను, అజ్ఞానమును "నేతి-నేతి" ఇదికాదు-ఇదికాదు అనెడి వాక్యముద్వారా తొలగించమని ప్రవచిస్తున్నాడు. ఇలా క్షేత్రమును విసర్జించి, క్షేత్రజ్ఞుని లోపల జ్ఞానస్వరూపమై ఉండు మూలపదార్థమును, అధిష్ఠాన సత్తా స్వరూపమైన పరబ్రహ్మమునే అవలోకించుచుండవలెనని వేమన యోగి తెలుపుచున్నాడు. ఇట్టి దివ్యదృష్టి గురుప్రసాదమై ఉన్నదని వేమన తెలుపును.

కోరి మదిని గురుని కొలువుజేయుట మేలు
గారవమునఁ దెలుపు గహన విద్య
దూరదృష్టి నిలిపి తొడరుట మోక్షంబు
విశ్వదాభిరామ వినురవేమ !

గురువులను సేవించినచో రహస్యమగు బ్రహ్మవిద్య లభించును. దానిని గ్రహించి ముందుచూపుతో మెలిగినచో మోక్షము కరతలామలకము గును అని వేమన తెలుపుచున్నాడు.

Dr Dayananda Swamy ebooks

ఇవీ - అవీ

వ్యక్తికి విద్యయే భూషణము. విద్యకు వినయమే భూషణము. వినయము లేనివిద్య విడ్డూరమై వికృతమై ఉండును. విద్య లేనివాడు వింత పశువు అందురు. కానీ వినయము లేనివాడు చెత్త కసువు.

విద్య గలిగియుండి వినయము లేకున్న
నైదువలకు మేలిమైన మణుల
సొమ్ములుండి కంఠసూత్రము లేనట్లు
విశ్వదాభిరామ వినురవేమ !

వినయములేని విద్వాంసునకు విలువలేదని వేమన తెలుపుచున్నాడు. స్త్రీలకు విశేషముగా సొమ్ము లుండినను మంగళసూత్రము లేనిచో సమస్తమూ నిష్ప్రయోజనమే అగునట్లు. వినయము ఒక్కటి కొరవైనచో ఎంత పాండిత్యముండినను నిరుపయోగమే నని వేమన అభిప్రాయము. భగవానుడు పాండిత్యమును చూడడు. భక్తినే గమనించును. విశేషముగ శాస్త్రములను అధ్యయనము చేసినవారు పొందలేని ముక్తిని నిరక్షరాస్యులైన భక్తులు పొందగలిగిరి. ఈ విషయమును వేమన తన మాటలలో చక్కగా వివరించును.

అక్షర పదవికి పదివే
లక్షరముల నలవనేల నల "శివ"యను రెం
డక్షరము లణచు దురితము
తత్క్షణమే పదవి గలుగు తథ్యము వేమా !

Dr Dayananda Swamy ebooks

అక్షర స్వరూపమైన బ్రహ్మమును పొందుటకు పదివేల అక్షరములను పలుక నవసరము లేదనియు, 'శివ' అనెడి రెండక్షరములే పాపము లను పోగొట్టి బ్రహ్మ పదవిని అందించగలవని వేమన తెలిపినాడు.

ఉత్తమ గతిని ఆశించువాడు సదా ఉన్నతముగనే చరించాలి ధర్మము నాచరించాలి. ఆదర్శము నెరుగని అయోగ్యుడు అందల మెక్కినను అభాగ్యుడే. ఈ విషయమును వేమన మాటలలో వినండి.

రాముడొకడు పుట్టి రవికులం బీడేర్చెఁ
గురుపతియును బుట్టి కులముఁ జెఱిచె
ఇల నధర్మ ధర్మముల రీతులిట్టివి
విశ్వదాభిరామ వినురవేమ !

రాముడు రాజుగా జన్మించెను. దుర్యోధనుడు కూడా రాజయ్యెను. రాముడు ధర్మస్వరూపుడై జీవించి రవికులమునకు కీర్తి నిలిపెను దుర్యోధనుడు కులనాశమునకు కారకుడయ్యెను. బలహీనతలు తెలియని పవిత్రభక్తులు భక్తిని పెంపొందింతురు. బలహీనులైన జిత్తులమారి భక్తులు భక్తిమార్గమున కంటకములై నిలుస్తారు.

ధర్మాచరణము ద్వారా పుణ్యవంతు డయ్యేందుకు, సత్యావ లోకనము ద్వారా ముక్తపురుషు డయ్యేందుకు మనిషి యత్నించాలి. కానీ భువిలో మానవుడు కుక్షింభరిత్వమునకే ఎక్కువగా విలువనిచ్చి పాడగుచున్నాడు. కూటికొరకు కోటి విద్యలు నేర్చి సాధించే దేముం టుంది? కానీ మనస్సునకు ఈ విషయములో అవగాహన కుదరదు

Dr Dayananda Swamy ebooks

కడుపు కేల మనస కళవళ పడియెదు
కడుపు కేడ దృష్టి కలుగుచుండు
కరప రాతిలోని కప్పకుఁ గలుగదా
విశ్వదాభిరామ వినుర వేమ !

ఓ మనసా ! పొట్టకూటికై ఎందులకు అంతగా దుఃఖిస్తావు? కడుపుకు తృప్తి యనునది ఉన్నదేమో ఆలోచించు. జీవించేందుకు ఆహారము అవసరము. దానిని పరమాత్మ ఎలాగో అందించగలడు. రాతిలోని కప్పకు ఆహార మిడినవాడు నీకు అందించడా? అనవసరముగా ఆదుర్దా చెందుతున్నావు. ఈ మాత్రపు అవగాహన బ్రతుకులో ఏర్పడితే చాలు. కడుపు కొరకు కర్కశ కర్మములు నాచరించు దురవస్థ దూరమగును.

సాధకునకు వాఙ్నియమము కూడా అత్యంత ఆవశ్యకమై ఉన్నది. వాచక తపస్సు నెరుగని వానికి వాసనాక్షయము జరుగుట అసంభవము. అవసరమైన విషయాన్నే పలకాలి. ఎక్కువగా వినాలి. తక్కువగా మాట్లాడాలి.

ద్వారబంధమునకుఁ దలుపులు గడియలు
వలెనె నోటికొప్పు గల నియతులు
ధర్మ మెఱిఁగి పలుక ధన్యుఁడౌ భువిలోన
విశ్వదాభిరామ వినుర వేమ !

ఇంటిలోని సంపదను రక్షించు కొనుటకు ద్వారబంధములు, తలుపులు, గడియలు ఎలా ఉపయోగ పడుచున్నవో అలాగే దంతములు, పెదవులు నోటిలోని వాక్కును సంరక్షించు కొనుటకు ఉపయోగపడు

Dr Dayananda Swamy ebooks

చున్నవి. వాచాలుడైన వానికి విచారము అలవడదు. విచారము లేని వాడు విహరించునే గాని విలువ దెలిసి విద్య నందలేడు.

తిత్తిలోని శివుని స్థిరముగా తెలియక
తిక్కపట్టి నరుడు తిరుగుచుండు;
తిక్క తీర్పగ గురుడొక్కడె దిక్కురా
విశ్వదాభిరామ వినురవేమ!

దేహములో తెలియు దేవుని తెలియలేక దారితప్పి జనులు పిచ్చివారి వలె సంచరించు చుందురు. ఈ పిచ్చిని పోగొట్టి ఉద్ధరించు మహాత్ముడు గురుదేవుడే గాని వేరొకడు గానేరడు అని వేమన పలుకు చున్నాడు.

విజయుడైనవాడు విల్లంది నంతనె
కుజను లెల్లవారు కూలిరిగద
భజన చేయునతడు విజయము గాంచుడా
విశ్వదాభిరామ వినురవేమ!

అర్జునుడు గాండీవమును ధరించగానే దుర్జనులైన కౌరవులందరూ కూలిపోయారు. పార్థుని విజయము పార్థసారథి వలన కలిగినదియే గదా! భగవంతుని విశ్వసించిన భక్తునికి ఎన్నడూ అపజయము కలుగదు. భక్తునికి అపజయము తెలియదు. అలాగుననే జ్ఞానికి నశింపు తెలియదు. వినాశము నెరుగని విమల స్థితియే జ్ఞానము.

Dr Dayananda Swamy ebooks

మనసు వాక్కు కర్మ మఱియేమి లేకయే
రాకపోక లేని రాజవీధి
పరగ హాని కలదె పరతత్త్వ యోగికి
విశ్వదాభిరామ వినురవేమ !

మనోవాక్కాయ కర్మములకు అతీతుడై, జన్మమృత్యువులు అవగతము గాని దివ్యమార్గాన ఉజ్వలమై భాసించు పరతత్త్వయోగి అప్రకాముడై ఉన్నందున అతడు నాశము నెఱుగడు. ఇట్టి దివ్యస్థితి ప్రాప్తించవలె ననిన బంధముల నొనగూర్చు బాంధవ్యములను విడనాడాలి. నిత్యమైన వస్తువుతో సాంగత్యమును కుదుర్చుకోవాలి.

తల్లిపార్వతి యగుఁ దండ్రియౌ శంభుఁడు
ప్రమథ గణము లఖిల బంధు వితతి
తనకు పుట్టినిల్లు తనరి కైలాసము
విశ్వదాభిరామ వినురవేమ !

పార్వతీదేవియే మనకు తల్లి. పరమేశ్వరుడే మనకు తండ్రి. శివభక్తులే మనకు బంధువులు. కైలాసమే మనకు పుట్టినిల్లు.

వేమన తెలిపిన ఈ విశిష్ట జ్ఞానమును మదిలో నిడుకొని సమాజములోని వ్యక్తులు, భక్తులు చరించ గలిగినచో భూలోకమే కైలాసము కాగలదు. విశ్వమంతయూ శాంతితో తులదూగ కలదు. సర్వారిష్టములు, సర్వోపద్రవములు సమసిపోయి జనజీవనము నందన వన విహారము కాగలదు. ప్రతిమానవుడు మాధవుని ప్రతిరూపముగా మహీతలముపై నిలువగలడు.

లోకాస్సమస్తా స్సుఖినోభవన్తు

Dr Dayananda Swamy ebooks

ఫలశ్రుతి

దివ్యాత్మ స్వరూపులారా !

వేమనార్యుని విమల పలుకులను వింటిరి గదా ! విన్నంత మాత్రాన సరిపోదు. వినిన దానిని బ్రతుకులో కనినపుడే సర్వ విభవములు కలుగును. దీనినే ఫలశ్రుతిగా వేమన తెలుపుచున్నాడు.

వేమన పద్యము లెల్లను
ప్రేమముతోఁ జదివినట్టి సజ్జనులెల్లన్
సోమన తల గల యాతని
సామీప్యము నొందఁగలరు సత్యము వేమా !

వేమన చెప్పిన పద్యములను చక్కగా పఠించు సజ్జనులు భగవంతుని చేరి ధన్యులు కాగలరు. ఈ విషయము ముమ్మాటికి సత్యము.

వేమన తాత్త్వికుడై పలికిన విశిష్ట విషయములే వేమన పద్యములు అని ఇందుమూలముగా మనకు తెలియుచున్నది. అట్టి వేమనను హేతువాదిగాను, భౌతిక వాదిగాను చిత్రించుటకు యత్నించు విశృంఖలవాదులు తూర్పును చూస్తూ పడమరను వర్ణించు వింతవ్యక్తులు. అయోమయపు జీవులు. సంఘజీవనములోని అసమానతలను చూసి వేమన కలత చెంది కఠినములైన పదములను ప్రయోగించిన మాట వాస్తవమే. కాని నిరీశ్వర వాదమును, పిచ్చికేకలతో హింసా జీవనముతో కూడిన విప్లవ దౌష్ట్యమును వేమన ఎప్పుడూ అంగీకరించడు పైపెచ్చు ఉమ్మి వేసేందుకు కూడా వెనుకాడడు. వేమనార్యుడు తెలిపిన ఋజుమార్గము భక్తులకు దారిదీపము కాగలదని నా విశ్వాసము.

శుభమస్తు.

Dr Dayananda Swamy ebooks

వేమన యోగి ఒక విచిత్రమైన వ్యక్తి. అతడు వ్యక్తికాదు. వ్యవస్థ. అంటే సుస్థిరమైన ఒక వ్యవస్థయా ? కాదు. వ్యవస్థనే నిలదీసి, నిగ్గుదీర్చే ఒక దుడుకు వ్యవస్థ. సుడులు తిరిగే దుర్వ్యవస్థలను తట్టి ఆపే సద్విమర్శనాత్మక వ్యవస్థ. విమర్శలలో రమిస్తూ, విమర్శలకు దక్కని, పరామర్శలకు చిక్కని ఒక అపూర్వ వ్యవస్థ. అది సంస్థా పరమైన వ్యవస్థకాదు. వ్యవస్థాపరమైన సంస్థ. గోడలులేని సంస్థ. మేడలు తెలియని సంస్థ. సమస్యలకు నిలయమైన సంస్థ. సమస్యలను పరిష్కరించే సంస్థ. పారద్రోలే సంస్థ.

స్వామి సుందర చైతన్యానంద